
FLASH INDIA NEWS
www.flashindianews.com
ఫ్లాష్ ఇండియా
తెలుగు దినపత్రిక
FLASH INDIA TELUGU DAILY
RNI NO. APTEL/2010/33229

విలేకరులు కావలెను
17 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక :53 | బుధవారం 25.03.2026 | ఎడిటర్ :కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/-

# నియోజకవర్గాల.. పునర్విభజన!



2029 ఎన్నికల నుంచే అమలు

తెలంగాణలో 179


ఏపీ అసెంబ్లీలో 263

లోక్ సభ స్థానాలు..
తెలంగాణ-26
ఆంధ్రప్రదేశ్ - 38



## 816కు పెరగనున్న లోకసభ స్థానాలు

## లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు 50 శాతం పెంపు..




ఈ సెషన్లోనే పునర్విభజన బిల్లు.. వేగంగా అడుగులు వేస్తున్న కేంద్రం
వామపక్ష, ఎన్డీఏ కూటమి పార్టీలతో చర్చలు..
కాంగ్రెస్తో అమిత్ షా భేటీ!
2011 జనాభా ప్రతిపాదికన 50శాతం సీట్లు పెంపు..
816కు లోక్సభ సీట్లు 03
అసెంబ్లీల సీట్లు 4,123 నుంచి 6,185 పెరుగుదల
లోక్సభ, అసెంబ్లీలో 33% మహిళలకు రిజర్వేషన్

దేశ రాజకీయాల్లో కీలక మార్పులకు దారి తీసే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ స్థానాలను 50 శాతం పెంచాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన బిల్లును ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశ పెట్టడానికి సిద్ధమైనట్లు తెలిసింది. దీని ప్రకారం.. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలు 816కి పెరగనున్నాయి. ఇదే విధంగా దేశవ్యాప్తంగా అసెంబ్లీ స్థానాలు కూడా 4,123 నుంచి 6,185కు పెరుగుతాయి.ఈ ప్రతిపాదనలో భాగంగా తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు గణనీయంగా పెరగనున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 17 లోక్‌సభ స్థానాలు 26కు.. అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 179కి పెరగనున్నాయి. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి.. అసెంబ్లీ స్థానాలు 175 నుంచి 263కు చేరే అవకాశం ఉంటుంది.ఇందుకు సంబంధించిన సమాచారాన్ని సోమవారం సాయంత్రం ఎన్డీయే సమావేశంలో కేంద్ర ప్రభుత్వం వామపక్ష పార్టీలకు వెల్లడించినట్లు తెలుస్తోంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్‌ల నేతృత్వంలో భేటీ జరిగింది.

# చీటింగ్.. ఫైటింగ్!

## చీటింగ్ బడ్జెట్ అన్న మహేశ్వర్ రెడ్డి

- పవిత్ర పత్రాన్ని చీటింగ్ అంటారా..? మంత్రి శ్రీధర్ బాబు ఫైర్
- కాగితాలకే పరిమితమైందన్న ఏలేటి మంత్రులు జూపల్లి, సీతక్క తీవ్ర అభ్యంతరం
- రికార్డుల నుంచి తొలగించాలని అధికార పక్షం పట్టు
- సానుకూలంగా స్పందించిన స్పీకర్ ప్రసాద్ కుమార్ 03

చీటింగ్ బడ్జెట్ అంటూ బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్య అసెంబ్లీలో దుమారం రేపాయి. దీనిపై అధికార పక్షం ముప్పేట దాడికి దిగింది. పవిత్రమైన డాక్యుమెంట్ ను చీటింగ్ అని ఎలా అంటారంటూ నిలదీ శారు మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, జూపల్లి కృష్ణారావు. బడ్జెట్ పై చర్చ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ మూలధన వ్యయం సున్నా.. ఆరు గ్యారంటీలకు నిధులు కేటాయిం చలేదు.. అభయ హస్తం పేరుతో కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు కేటాయింపులు లేవు.. ఇంది రమ్మ ఇళ్లకు భారీ కోత విధించారు.. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకపోవడం వల్ల అనేక మంది చని పోయారు.





# నాది పరిష్కారం లేని సమస్య..

- టీపీసీసీ చీఫ్ మహేష్ తో జీవన్ రెడ్డి
- ఇంత అవమానించినా పార్టీలో ఉండాలా?
- జీవన్రెడ్డి నివాసానికి వెళ్లి కలిసిన టీపీసీసీ బృందం
- కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు జీవన్రెడ్డి నిరాకరణ
- తండ్రి సమానులు.. పార్టీ మారొద్దని మహేష్ గౌడ్ రిక్వెస్ట్
- కండువా వేసుకొనేందుకు నిరాకరణ?
- పార్టీలో జరిగిన అన్యాయం చాలని వ్యాఖ్య 03






# ప్రభుత్వ ఉద్యోగులకు ఈవీ వాహనాలు

- 20%రాయితీ ఇస్తామన్న మంత్రి పొన్నం
- ఈవీ ఆటోలతోపాటు బస్సులు తీసుకువస్తున్నాం
- కాలుష్యాన్ని అరికట్టేందుకు చర్యలు..
- వెయ్యి కోట్లు నష్టమైన ఈవీ పథకం అమలు మంత్రి పొన్నం 03

# హైదరాబాద్లో భారీ స్కాం..

## సబ్ రిజిస్ట్రార్లతో సహా పలువురిపై కేసులు

- నిజాంపేట పరిధిలో ప్లాట్ల విక్రయం పేరిట జరిగిన ఈ కోట్లాది రూపాయల కుంభకోణం
- ఒకరి కంటే ఎక్కువ మందికి విక్రయించి (డబుల్ రిజిస్ట్రేషన్) 02
- అమాయక కొనుగోలుదారులను బురిడీ కొట్టించిన ముఠాపై పోలీసులు ఉక్కుపాదం
- బాధితుల నుంచి రూ.15.26 కోట్లు వసూలు చేసి, అదే ప్లాట్లను..

### హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ బడా మోసం..



ఏఐ జనరేటెడ్ ఫోటో



## జీవో 76తో ఊరట..

- ప్రతి అంగుళాన్నీ సర్వే చేస్తం ఆధార్ మాదిరిగానే భూధార్ కార్డులు
- ఏప్రిల్ నెలాఖరు కల్లా భూభారతి రెడీ సాదా బైనామా దరఖాస్తులు పరిష్కరిస్తం
- కొనుగోలుదారు సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తే చాలు
- శాసన మండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 03



# గ్యాస్ కొరత తీవ్రంగా ఉంది..


- గ్యాస్ కష్టాలు తీర్చాలి... కొరత లేదంటూనే కష్టాల్లోకి నెడుతున్నారు
- గ్యాస్ కంపెనీల వద్ద పెద్ద పెద్ద క్యూ లైన్లు.. ఆంబోతుల కుమ్ములాటలో సామాన్యులకు గ్యాస్ కష్టాలు
- గ్యాస్ కొరత లేదంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. ఎన్నికలు ముగిసిన వెంటనే 10కేజీల సిలిండర్లే 05

# మతం మారితే ఎస్సీ హక్కులు వర్తించవు..

## మారితే క్రైస్తవంలోకి ఎస్సీ హోదా రద్దు

- క్రైస్తవ మతంలోకి మారిన వ్యక్తికి అట్రాసిటీ చట్టం వర్తించదు
- ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు
- కుల సర్టిఫికెట్ ఉన్నా రక్షణ కల్పించలేమని స్పష్టం
- తిరిగి సమాజంలో చేరితేనే హోదా పునరుద్ధరణకు అవకాశం 02

హిందూ, బౌద్ధ, సిక్కు మతాలు తప్ప ఇతర మతాల్లో ఎస్సీ హోదా లేదు



మతం మార్చుకున్న వెంటనే ఎస్సీ హోదా రద్దవుతుందని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. "హిందూ, బౌద్ధ, సిక్కు మతాలు కాకుండా ఇతర మతాల్లో ఉన్నవారు షెడ్యూల్డ్ కులాల కింద పరిగణించబడరని స్పష్టం చేసింది. క్రై స్తవ మతంలోకి మారి పాస్టర్గా పని చేస్తున్న వ్యక్తి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద రక్షణ పొందలేరని పేర్కొంది. ఈ కేసులో ఆంధ్రప్రదే శ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్ధించింది. రాజ్యాంగం (షెడ్యూల్డ్ కులాలు) ఆర్డర్ 1950 ప్రకారం హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు మాత్రమే ఎస్సీ హోదా వర్తిస్తుందని ధర్మాసనం...

# మతం మారితే ఎస్సీ హక్కులు వర్తించవు..

**ఢిల్లీ :** భారత సుప్రీం కోర్టు మత మార్పిడిలపై సంచలన తీర్పును ప్రకటించింది. ఎస్సీ కులానికి చెందిన వారు మతం మారితే ఎస్సీ హోదా రద్దు అవుతుందని ఈ సందర్భంగా కోర్టు స్పష్టం చేసింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోకి కాకుండా ఇతర ఏ మతంలోకి మారిన వారి ఎస్సీ హోదా రద్దు అవుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గతంలో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలను చేసింది. గతంలో ఏపీ హైకోర్టు జరిగిన విచారణలో.. క్రైస్తవ మతంలోకి మారిన పాస్టర్ ఎస్సీ ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని సుప్రీం న్యాయస్థానం స్పష్టం చేసింది. దీనిని సవాల్ చేస్తూ వారు సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పుకు సుప్రీంకోర్టు మద్దతుగా నిలిచింది.

**అసలు కేసు ఏంటీ అంటే..?**

గుంటూరు జిల్లా పిట్టలవానిపాలెంలో ఒక పాస్టర్‌పై జరిగిన దాడికి సంబంధించిన కేసు విచారణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. దశాబ్ద కాలంగా పాస్టర్‌గా పనిచేస్తున్న వ్యక్తి క్రైస్తవ మతాన్ని స్వీకరించినట్లు కోర్టు గుర్తించింది. క్రైస్తవ మతంలో కుల వ్యవస్థకు తావులేదని, కాబట్టి ఒక వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారిన తర్వాత అట్రాసిటీ చట్టం కింద ఫిర్యాదు చేసే హక్కు ఉండదని కోర్టు స్పష్టం చేసింది. దాడి జరిగిన సమయంలోనూ సదరు వ్యక్తి ప్రార్థనలు చేస్తున్నట్లు గుర్తించిన కోర్టు, ఈ వ్యాఖ్యలు చేసింది. తహశీల్దార్ ఇచ్చిన ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం ఉన్నప్పటికీ, మత మార్పిడి తర్వాత ఆ చట్టపరమైన రక్షణ పొందేందుకు సదరు వ్యక్తికి అర్హత ఉండదని కోర్టు పేర్కొంది. రాజ్యాంగంలోని 341 అధికరణ ప్రకారం, ఎస్సీ హోదా కేవలం హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను అనుసరించే వారికి మాత్రమే పరిమితం చేయబడింది. మత మార్పిడి ద్వారా క్రైస్తవం, ఇస్లాం మతాన్ని స్వీకరించినప్పుడు సహజంగానే ఎస్సీ హోదా రద్దవుతుందని, తద్వారా అట్రాసిటీ చట్టం వర్తించదని హైకోర్టు ఈ కేసులో వ్యాఖ్యానించింది. ఈ తీర్పును సవాల్ చేసి సుప్రీంకి వెళ్లిన ఫాస్టర్ కు అక్కడ కూడా చేదు అనుభవం ఎదురైంది.

# హైదరాబాద్లో భారీ స్కాం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో మరో భారీ మోసం వెలుగుచూసింది. నిజాంపేట పరిధిలో ఫ్లాట్ల విక్రయం పేరిట జరిగిన ఈ కోట్లాది రూపాయల కుంభకోణంపై సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. వారిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**ప్రభుత్వ అధికారుల పాత్ర**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేటలోని విలువైన భూమిలో నిర్మించిన ఫ్లాట్లను ఒకరి కంటే ఎక్కువ మందికి విక్రయించి (డబుల్ రిజిస్ట్రేషన్), అమాయక కొనుగోలుదారులను బురిడీ కొట్టించిన ముఠాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఈ కేసులో ప్రభుత్వ అధికారుల హస్తం కూడా ఉండటం గమనార్హం. బాధితుల ఫిర్యాదు మేరకు సైబరాబాద్ జూఆె పోలీసులు నిడమర్తి శివప్రసాద్, నవీన్‌కుమార్ గోయల్, నరేంద్రకుమార్ మోదీ, శశికాంత్ మోదీలపై కేసు నమోదు చేశారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్లకు సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్లపై కూడా కేసులు నమోదయ్యాయి.

**మోసం జరిగిన తీరు..**

నిందితులు పక్కా పథకం ప్రకారం ఈ మోసానికి పాల్పడ్డారు. నిజాంపేటలోని 3 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఫ్లాట్లను గతంలోనే కొందరు వ్యక్తులకు విక్రయించారు. ఆ ఫ్లాట్లు అప్పటికే అమ్ముడైన విషయాన్ని గోప్యంగా ఉంచి, మోటూరి శ్రీనివాస్ ప్రసాద్, సూర్యకమల్ ప్రసాద్‌లను సంప్రదించారు. బాధితుల నుంచి రూ.15.26 కోట్లు వసూలు చేసి, అదే ఫ్లాట్లను వీరికి మళ్లీ రిజిస్ట్రేషన్ చేశారు.

**పోలీసుల దర్యాప్తు..**

అప్పటికే విక్రయించిన ఆస్తులను మళ్లీ తమకు అమ్మినట్లు గుర్తించిన బాధితులు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు రంగంలోకి దిగి ఈ కేసును సీరియస్‌గా తీసుకుని సమగ్ర దర్యాప్తు చేపట్టారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని పాత రికార్డులను, నిందితుల బ్యాంకు ఖాతాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

# ఇది పక్కా లొట్టపీసు కేసే



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా:** తనపై ఫార్ములా-ఈ రేస్ కేసులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన 'చిట్ చాట్'లో ఆయన ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ కేసు కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యేనని, ఇందులో అంగుళం కూడా నిజం లేదని స్పష్టం చేశారు.
ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైందని, దీనిపై తాము అసెంబ్లీలో 'ప్రైవేట్ మెంబర్ బిల్లు' ప్రవేశపెడుతున్నామని కేటీఆర్ తెలిపారు. "మేము గ్యారెంటీలపై బిల్లు పెడుతుండటంతో, ప్రజల దృష్టిని మళ్లించేందుకే హడావుడిగా నాపై ఛార్జ్‌షీట్ వేశారు. ఇది ముమ్మాటికీ అక్రమ కేసు," అని ఆయన మండిపడ్డారు. ఈ కేసులో అధికారులను ఇబ్బంది పెట్టడం సరికాదని కేటీఆర్ హితవు పలికారు. "మీకు నాపై కక్ష ఉంటే నేరుగా నాపై తీర్చుకోండి. నిర్ణయం తీసుకున్నది నేను, కాబట్టి ఏ చర్యలైనా నాపైనే ఉండాలి. అనవసరంగా అధికారులను బలి చేయడం కరెక్ట్ కాదు," అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**డబ్బులు ఎక్కడికి వెళ్లాయో అందరికీ తెలుసు..**

ఫార్ములా-ఈ నిధుల దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలను కేటీఆర్ కొట్టిపారేశారు. "ఒక్క రూపాయి కూడా దారి మళ్లలేదు. డబ్బులు నేరుగా కంపెనీకి వెళ్లాయి, అది అందరికీ కనిపిస్తోంది. క్విడ్ ప్రో కో జరిగిందని చెబుతున్నారు కదా.. మరి గ్రీన్ కో కంపెనీపై ఎందుకు కేసు పెట్టలేదు? మీడియానే దీనిపై ఆలోచించాలి. హైదరాబాద్ ఇమేజ్ పెంచేందుకు, పెట్టుబడులు ఆకర్షించేందుకే ఈ రేస్ నిర్వహించాం. దీని వల్ల రాష్ట్రానికి ప్రయోజనం కలిగింది అని కేటీఆర్ చెప్పుకొచ్చారు.

**అందాల పోటీలకు 200 కోట్లు ఎందుకు..?**

ప్రస్తుత ప్రభుత్వంపై కూడా కేటీఆర్ ఎదురుదాడి చేశారు. "ప్రభుత్వం అందాల పోటీల కోసం 200 కోట్లు ఖర్చు చేసింది. దీనివల్ల రాష్ట్రానికి ఏం ప్రయోజనం చేకూరింది?
ఒక మహిళా ప్రతినిధి ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేసినా ఎందుకు స్పందించడం లేదు?" అని ప్రశ్నించారు. మొదటి నుంచి చెబుతున్నా.. ఇది 100% లొట్టపీసు కేసు. లేని కేసును ఉన్నట్లుగా మసిబూసి మారేడు కాయ చేస్తున్నారు. న్యాయపరంగా దీనిని ఎదుర్కొంటాం," అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.




# విద్యార్థులకు ఇస్రో బంపర్ ఆఫర్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు యువ శాస్త్రవేత్తలు 'గా ఎదగడానికి ఇస్రో బంపర్ ఆఫర్ ప్రకటించింది. పాఠశాల విద్యార్థుల కోసం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ 'యువ శాస్త్రవేత్త కార్యక్రమం' ను ప్రకటించింది. అంతరిక్ష విజ్ఞానం, సాంకేతికత, శాస్త్ర అనువర్తనాలపై విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కల్పించడమే ఈ శిక్షణా కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఎంపికైన విద్యార్థులకు మే 11 నుండి మే 22, 2026 వరకు ఇస్రోకు చెందిన వివిధ కేంద్రాల్లో నిపుణులైన శాస్త్రవేత్తలచే ప్రత్యక్ష శిక్షణ ఇవ్వబడుతుంది. ఈ శిక్షణకు సంబంధించిన ప్రయాణ, వసతి, భోజన ఖర్చులన్నింటినీ ఇస్రో స్వయంగా భరిస్తుంది. ఈ వినూత్న కార్యక్రమానికి దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 31, 2026 ఆఖరి తేదీ గా నిర్ణయించారు. విద్యార్థుల ఎంపిక కేవలం 8వ తరగతి మార్కులపైనే కాకుండా, ఆన్‌లైన్ క్విజ్, సైన్స్ ఫెయిర్స్, ఒలింపియాడ్స్, క్రీడల్లో వారి ప్రతిభ ఆధారంగా జరుగుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పంచాయతీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎంపిక ప్రక్రియలో 15 శాతం అదనపు వెయిటేజీ ఇవ్వడం గమనార్హం. ఆసక్తి గల విద్యార్థులు ఇస్రో అధికారిక వెబ్‌సైట్ 'అంతరిక్ష జిజ్ఞాస' ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. దేశ భవిష్యత్ శాస్త్రవేత్తలను తీర్చిదిద్దే ఈ అద్భుత అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విద్యా నిపుణులు కోరుతున్నారు.



# ఇంధన నిల్వలు పుష్కలం..

**ఢిల్లీ :** పశ్చిమ ఆసియా (గల్ఫ్) దేశాల్లో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పార్లమెంటు వేదికగా కీలక ప్రకటన చేశారు. గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న భారతీయుల భద్రత విషయంలో ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా ఉందని, అదే సమయంలో దేశంలో ఇంధన సరఫరాకు ఎటువంటి ఆటంకం లేదని ఆయన స్పష్టం చేశారు. గల్ఫ్ దేశాల్లో దాదాపు ఒక కోటి మందికి పైగా భారతీయ కార్మికులు ఉపాధి పొందుతున్నారని, ప్రస్తుత యుద్ధ సంక్షోభం వారి భద్రతపై ఆందోళన కలిగిస్తోందని ప్రధాని పేర్కొన్నారు. అయితే, ప్రభుత్వం చేపట్టిన ముందస్తు చర్యల వల్ల ఇప్పటివరకు 3.75 లక్షల మంది భారతీయులు సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారని ఆయన వెల్లడించారు. "యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న ప్రతి భారతీయుడిని రక్షించేందుకు మా రాయబార కార్యాలయాలు 24/7 పనిచేస్తున్నాయి. ఇప్పటికే లక్షలాది మంది సురక్షితంగా ఇళ్లకు చేరుకున్నారు," అని మోడీ పేర్కొన్నారు.

**ఇంధన నిల్వలు పు-**

అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు, సరఫరాపై నీలినీడలు కమ్ముకున్నప్పటికీ.. భారతదేశంలో గ్యాస్, పెట్రోల్ కొరత లేదని ప్రధాని భరోసా ఇచ్చారు. దేశ అవసరాలకు సరిపడా స్టాక్ అందుబాటులో ఉందని, సామాన్యులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని చెప్పారు. యుద్ధాన్ని నివారించి, శాంతిని నెలకొల్పేందుకు భారత్ తన వంతు ప్రయత్నం చేస్తోందని ప్రధాని తెలిపారు. ఈ క్రమంలోనే అమెరికా, ఇజ్రాయెల్ మరియు ఇరాన్ దేశాల అగ్రనేతలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని, ఉద్రిక్తతలు తగ్గాలని భారత్ కోరుకుంటోందని ఆయన స్పష్టం చేశారు.

# జనజీవన స్రవంతిలోకి వస్తున్నాను

**ఛత్తీస్‌గఢ్ :** దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఛత్తీస్‌గఢ్ అడవులను వణికించిన నక్సల్ సాయుధ పోరాటం ముగింపు దశకు చేరుకుంది. మావోయిస్టు ఉద్యమంలో అత్యంత కీలక నేతగా పేరుగాంచిన పాపారావు తన 17 మంది సహచరులతో కలిసి జనజీవన స్రవంతిలో చేరాలని నిర్ణయించుకున్నారు. ఇది ఛత్తీస్‌గఢ్ చరిత్రలోనే అతిపెద్ద విజయంగా భద్రతా బలగాలు భావిస్తున్నాయి. తాజాగా లొంగుబాటుపై పాపారావు నేరుగా మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. "నేను ఇకపై భారత రాజ్యాంగ పరిధిలో ఉంటూ, ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల గొంతుకను వినిపిస్తాను. ప్రభుత్వ పునరావాస పథకం కింద ప్రధాన స్రవంతిలోకి వస్తున్నాను" అని ఆయన ధృవీకరించారు. నేషనల్ పార్క్ ఏరియాలో అత్యంత క్రియాశీలంగా ఉన్న పాపారావు బృందం లొంగిపోవడంతో, నక్సల్స్ యొక్క వెన్నెముక విరిగినట్లయింది. నక్సల్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం మార్చి 31, 2026ని గడువుగా నిర్ణయించింది. తాజా పరిణామాలతో ఈ గడువు కంటే ముందే ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజం పూర్తిగా అంతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**మావోయిస్టు అగ్రనేత పాపారావుతో స్వయంగా మాట్లాడాను:ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో అత్యంత కీలకమైన మావోయిస్టు నేత పాపారావు తన బృందంతో కలిసి జనజీవన స్రవంతిలో చేరడం ఒక మైలురాయి వంటిదని ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పాపారావు గత మూడున్నర దశాబ్దాలుగా అడవుల్లో క్రియాశీలంగా ఉంటూ అనేక ఎన్‌కౌంటర్ల నుండి తప్పించుకున్నాడని, అతనిపై సుమారు 25 లక్షల రూపాయల బహుమతి కూడా ఉందని విజయ్ శర్మ తెలిపారు. పాపారావుతో తాను వ్యక్తిగతంగా ఫోన్‌లో మాట్లాడానని, అతనిలో వచ్చిన మార్పు స్పష్టంగా కనిపిస్తోందని ఆయన తెలిపారు. పాపారావు లొంగుబాటుతో ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఇకపై ఙఖ్హూజ స్థాయికి చెందిన అగ్రశ్రేణి నక్సలైట్లు ఎవరూ లేరని స్పష్టమైందని ఆయన వివరించారు. ప్రస్తుతం ఉన్న కొద్దిపాటి నక్సలైట్లు కూడా ఇప్పటికే తమ ఆయుధాలను వదిలేసి ఎక్కడో ఒకచోట స్థిరపడిపోయి ఉంటారని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుత రికార్డుల ప్రకారం సాయుధ నక్సలైట్ల సంఖ్య కేవలం 40 నుండి 45 వరకు మాత్రమే ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. రాబోయే ఏడు రోజుల్లో మరికొందరు నక్సలైట్లు కూడా ప్రధాన స్రవంతిలో చేరే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. శాంతియుత ఛత్తీస్‌గఢ్ నిర్మాణంలో ఇదొక గొప్ప పరిణామమని విజయ్ శర్మ కొనియాడారు.

# 'హోర్ముజ్' జలసంధిపైనే అందరి కళ్లు!



**ఢిల్లీ:** పశ్చిమాసియాలో ముదురుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోన్లో కీలక చర్చలు జరిపారు. ఈ ప్రాంతంలో శాంతి భద్రతలతో పాటు, ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్' జలసంధిని నిరంతరాయంగా తెరిచి ఉంచాల్సిన అవసరం ఉందని ఇరువురు నేతలు నొక్కి చెప్పారు. ఈ విషయాన్ని భారత్‌లో అమెరికా రాయబారి మరియు దక్షిణాసియా ప్రత్యేక దూత సెర్గియో గోర్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

**సంక్షోభానికి కారణం ఇదే..**

ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేయడంతో పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. దీనికి ప్రతిచర్యగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్ మరియు పలు గల్ఫ్ దేశాలపై దాడులకు దిగింది. ఈ పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రపంచ ఇంధన సరఫరాలో దాదాపు 20 శాతం వాటా కలిగిన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ నియంత్రణ కలిగి ఉంది. యుద్ధం మొదలైనప్పటి నుండి ఇరాన్ అక్కడ నౌకల రాకపోకలపై ఆంక్షలు విధించడంతో, అది పరోక్షంగా దిగ్బంధంగా మారింది. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. పశ్చిమాసియా ఇంధనంపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు సరఫరా సమస్యలు ఎదురవుతున్నాయి.

**దౌత్యపరమైన ముందడుగు..**

ఈ సంక్షోభం పరిష్కారానికి ప్రధాని మోడీ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ వంటి పలు దేశాల నేతలతో ఆయన చర్చలు జరిపారు. ఇటీవల ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెస్కియాన్‌తో మాట్లాడిన మోడీ, కీలక మౌలిక సదుపాయాలపై దాడులను ఖండించారు. అంతర్జాతీయ షిప్పింగ్ మార్గాలు సురక్షితంగా ఉండాలని స్పష్టం చేశారు. భారత్‌తో చర్చల సందర్భంగా ఇరాన్ అధ్యక్షుడు కొన్ని కీలక అంశాలను ప్రస్తావించారు. బాహ్య శక్తుల ప్రమేయం లేకుండా పశ్చిమాసియా దేశాల మధ్యే ఒక భద్రతా ఒప్పందం ఉండాలని ఆయన కోరారు. ప్రస్తుతం 'బ్రిక్స్' అధ్యక్ష హోదాలో ఉన్న భారత్, అమెరికా-ఇజ్రాయెల్ దాడులను ఆపేలా చొరవ తీసుకోవాలని కోరారు. తమ అణు కార్యక్రమాలపై అమెరికా చేస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. అంతర్జాతీయ పర్యవేక్షణలో చర్చలకు తాము సిద్ధమని పెజెస్కియాన్ పునరుద్ఘాటించారు.

# గుంతలు లేని రోడ్లుగా తీర్చిదిద్దాలి



**మేడ్చల్,ఫ్లాష్ ఇండియా :** మల్కాజిగిరి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఎం ఎం సి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం ఇంజనీరింగ్ నిర్వహణ, ఇంజనీరింగ్ ప్రాజెక్టులు, ఇంజనీరింగ్ ఎలక్ట్రికల్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి మొదట ఇంజనీరింగ్ నిర్వహణ విభాగం అధికారులతో మాట్లాడుతూ ..సీ.సీ, బీ.టి గుంతలు లేకుండా చేయాలని ఆదేశించారు. గుంతలు లేని కార్పొరేషన్ గా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ను తీర్చిదిద్దడం లక్ష్యంగా చేసుకొని పని చేయాలని తెలిపారు.

**ఇంజనీరింగ్ ప్రాజెక్టులు:**

ఇంజనీరింగ్ విభాగం 99 రోజుల కార్యాచరణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 528 పనులు అనుమతులు పొందగా,అందులో 11 పనులు పూర్తి అయ్యాయి. 111 పనులు 50 శాతానికి పైగా పూర్తి కాగా, మిగతా 67 పనులు 25 శాతం నుండి 50 శాతం వరకు పూర్తి అయ్యాయి. 339 పనులు 25 శాతం కన్నా తక్కువ పూర్తి అయ్యాయి అని కమిషనర్ తెలిపారు. ఇంజనీరింగ్ పనులను వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశించారు.

**వీధి దీపాల నిర్వహణ:**

వీధి దీపాల మరమ్మత్తులకు సంబంధించిన అవసరమైన సామాగ్రిని కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకోవాలని వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. కొత్త వీధి దీపాలు అవసరమైన చోట కొత్తవి, మరమ్మత్తులు అవసరమైన చోట మరమ్మత్తులు చేయాలని ఆదేశించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని తెలిపారు. ఏవైనా పిర్యాదులు అందిన వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎం ఎం సి చీఫ్ ఇంజనీర్ అశోక్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# కారేపల్లిలో మద్యం మాఫియా దందా!



**కారేపల్లి,ఫ్లాష్ ఇండియా :** కారేపల్లి మండలంలో అక్రమ మద్యం విక్రయాలపై ఎక్సైజ్ శాఖ దాడులు మళ్లీ చర్చనీయాంశంగా మారాయి. భాగ్యనగర్ తండా పరిధిలోని లావుడియా తండా గ్రామంలో సోమవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన అధికారులు, బెల్ట్ షాపులో నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం చేసుకున్నారు. స్థానికంగా సుమారు రూ.20 వేల విలువైన మద్యం పట్టుబడినట్లు సమాచారం. అయితే ఎక్సైజ్ సీఐ ప్రశాంతి వివరణ కోరగా.. రెండు మద్యం సీసాలను మాత్రమే స్వాధీనం చేసుకుని విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. ఇదే బెల్టు షాపుపై గతంలోనే రెండు కేసులు నమోదై, తహసీల్దార్ ఎదుట లక్ష రూపాయల బైండ్ ఓవర్ కూడా చేసినట్లు స్పష్టం చేశారు. కల్తీ మద్యం విక్రయాలపై ఎలాంటి సహనం ఉండదని సీఐ ప్రశాంతి హెచ్చరిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ దర్యాప్తు కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

# నియోజకవర్గాల.. పునర్విభజన!

## 2029 ఎన్నికల నుంచే అమలు, తెలంగాణలో ఎన్ని పెరుగుతాయంటే?

**ఢిల్లీ :** దేశ రాజకీయాల్లో కీలక మార్పులకు దారితీసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. లోక్సభ, రాష్ట్ర అసెంబ్లీ స్థానాలను 50శాతం పెంచాలని నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన బిల్లును ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి సిద్ధమైంది. దీని ప్రకారం.. ప్రస్తుతం ఉన్న 543 లోక్సభ స్థానాలు 816కి పెరగనున్నాయి. ఇదే విధంగా దేశవ్యాప్తంగా అసెంబ్లీ స్థానాలు కూడా 4,123 నుంచి 6,185కు పెరుగుతాయి. అటు లోక్ సభలోనూ, ఇటు అసెంబ్లీలోనూ 33 శాతం సీట్లు మహిళల కోసం రిజర్వ్ చేస్తారు. ఈ ప్రతిపాదనలో భాగంగా తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో లోక్ సభ, అసెంబ్లీ స్థానాలు గణనీయంగా పెరగనున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 17 లోక్సభ స్థానాలు 26కు.. అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 179కి పెరగ నున్నాయి. అదే విధంగా ఆంధ్రప్రదేశ్లో లోక్సభ స్థానాలు 25 నుంచి 38కి.. అసెంబ్లీ స్థానాలు 175 నుంచి 263కు చేరే అవకాశం ఉంటుంది.

**ఈ పార్లమెంట్ సెషన్లోనే...**

ఈ ప్రతిపాదనను అమలు చేయడానికి అవసరమైన బిల్లును ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయని సమాచారం. అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో ఈ బిల్లును ఆమోదింపజేయాలని కేంద్రం భావిస్తోంది. 2029 సాధారణ ఎన్నికల నుంచే ఈ కొత్త వ్యవస్థ అమ లులోకి వచ్చే అవకాశం ఉంది. జనాభా ఆధారంగా ప్రతినిధిత్వాన్ని పెంచడం, ప్రజల సమస్యలను మరింత సమర్థవంతంగా ప్రతిబింబించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు చెబుతున్నారు.

**2011 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా**

దేశంలో లోక్సభ, శాసనసభస్థానాల పునర్విభజనకు 2011 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా తీసుకోవాలని నిర్ణయించింది. ఇదే సమయంలో దేశంలో లోక్సభతోపాటు 28 రాష్ట్రాలలో శాసనసభస్థానాలను గంపగుత్తగా 50శాతం పెంచాలని నిర్ణయించింది.. అందులో 33 శాతం స్థానాలను మహిళలకు రిజర్వేషన్ చేయనుంది. నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే సార్వత్రిక ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించనుంది. పునర్విభజన తర్వాత దేశంలో లోక్సభ స్థానాలు 543 నుంచి 816కు పెరగనున్నాయి. ఇందులో మహిళలకు 33 శాతం అంటే 270 స్థానాలను రిజర్వేషన్ చేయనున్నారు.

**పెరగనున్న లోక్సభ సీట్లు**

ఈ కొత్త ప్రతిపాదన అమలైతే రాష్ట్రాల వారీగా లోక్సభ సీట్ల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ఉదాహరణకు, ఉత్తరప్రదేశ్లో 80 నుంచి 120కీ, బీహార్ 40 నుంచి 60కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయి. అలాగే ఏపీలో 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కీ పెరుగుతాయి. జనాభా నియంత్రణ పాటించడం వల్ల తమ ప్రాతినిధ్యం తగ్గుతుందని ఆందోళన చెందుతున్న దక్షిణాది రాష్ట్రాల అనుమానాలను నివృత్తి చేసేందుకే, అన్ని రాష్ట్రాల్లో దామాషా ప్రకారం 50% సీట్లు పెంచుతున్నట్లు ప్రభుత్వం వివరించింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్ స్థానాలు కూడా ఇదే నిష్పత్తిలో 84 నుంచి 1268, 47 నుంచి 70కి పెరుగుతాయి. ఇక రాష్ట్రంలో ఒక్కో శాసనసభ స్థానం పరిధిలో సగటున 1.60 లక్షల మంది ఓటర్లు ఉంటారనే అంచనాలున్నాయి.

**రంగంలోకి అమిత్ షా..**

ఎన్డీయే సమావేశంలో కేంద్ర ప్రభుత్వం వామపక్ష పార్టీలకు వెల్లడిం చినట్లు తెలుస్తోంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్లమెంటరీ వ్యవ హారాల మంత్రి కిరణ్ రిజిజు, న్యాయశాఖ మంత్రి అర్జున్రామ్ మేఘవాల్ నేతృత్వంలో జరిగిన భేటీలో ఈ నిర్ణయంపై మిత్రపక్షాలకు వివరించారు. ఇదే సమయంలో కాంగ్రెసేతర విపక్షాలతోనూ విడిగా ఎన్డీఏ ప్రతినిధుల సమావేశమై ఈ నిర్ణయాన్ని ప్రకటించి మద్దతు ఇవ్వవలసిందిగా కోరినట్టు తెలుస్తోంది. ఇక.. కాంగ్రెస్ పార్టీతోనూ అమిత్ షా స్వయంగా మాట్లాడనున్నారు.

**ఎస్సీ, ఎస్టీలకు..**

దేశంలో ప్రస్తుతం ఎస్సీ రిజర్వుడ్ లోక్సభసీట్లు 84 ఉన్నాయి. ఎస్టీ వర్గాలకు సంబంధించి రిజర్వుడు లోక్సభ స్థానాలు 47 ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజనతో సీట్ల పెంపు నేపథ్యంలో అదే దామాషాలో వారి సీట్లు పెరగనున్నాయి. ఎస్సీ, ఎస్టీ ఓటర్లు గరిష్ఠంగా ఉన్న చోట ఆయా వర్గాలకే సీట్లు కేటాయించనున్నారు. ఈ సామాజిక వర్గాలకు అసెంబ్లీ స్థానాలు కూడా అదే నిష్పత్తిలో పెరగనున్నాయి.

**ఇది ఐదోసారి...**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక నియోజకవ ర్గాల పునర్విభజనను గతంలో నాలుగు సార్లు (1952, 1963, 1973,20022008) ప్రభుత్వం చేపట్టింది. ప్రస్తుతం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన ఐదోది కావడం గమనార్హం. చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించే బిల్లును 2023లో పార్లమెంటు ఆమోదించింది. మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్ కల్పిస్తూ (ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్తో కలిపి) 128వ రాజ్యాంగ సవరణ చేసింది. ఈ నేపథ్యంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ ను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

**50% పెంపు..**

దేశంలో ప్రస్తుతం ఉన్న లోక్ సభ, శాసనసభ స్థానాలను గంపగుత్తగా 50% పెంచాలని నిర్ణయించింది. ఆ మేరకు లోకసభ, శాసనసభస్థానాలను పెంచుతూ నియో జకవర్గాల పునర్విభజన చేపట్టే బిల్లును పార్లమెంటు రెండింట మూడొంతుల మెజార్టీతో ఆమోదించాల్సి ఉంటుంది. ఆ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింపజేసేందుకు అన్ని రాజకీయ పార్టీలతో కేంద్ర ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ప్రస్తుత సమావేశాల్లోగానీ లేదా వర్షాకాల సమావేశాలు లేదంటే ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పార్లమెంటులో ఆ బిల్లును ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

**ఏపీ, తెలంగాణలో..**

ఏపీలో ప్రస్తుతం లోక్సభ స్థానాలు 25 ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజనతో 50% అంటే 12.5 స్థానాలు పెరగాలి.. కానీ, 50% స్థానాలు పెంచేటప్పుడు 12.4 స్థానాలు వస్తే.. దాన్ని 12గానే పరిగణించి స్థానాలు పెంచుతారు. అదే 12.6 స్థానాలు వస్తే.. దాన్ని 13 స్థానాలుగా పరిగణించి పెంచుతారు. ఈ నేపథ్యంలో ఏపీలో 12.5 స్థానాలు వస్తే లాటరీ వేస్తారు. ఆ లాటరీలో రాష్ట్రానికి అనుకూలంగా ఫలితం వస్తే 13 స్థానాలు.. ప్రతికూలంగా వస్తే 12 స్థానాలనే పెంచుతారు. ఈ నేపథ్యంలో నియోజకవ ర్గాల పునర్విజన తర్వాత రాష్ట్రంలో లోక్సభస్థానాలు 25 నుంచి 37 లేదా 38కి పెరుగు తాయి. ఇందులో 33% అంటే 12 లేదా 13 స్థానాలు మహిళలకు రిజర్వేషన్ చేస్తారు. ఇక రాష్ట్రంలో ప్రస్తుతం 175శాసనసభస్థానాలు ఉన్నాయి. నియోజకవర్గాల పున ర్విభజన తర్వాత అసెంబ్లీ సీట్లు 262 లేదా 263కు పెరుగుతాయి. అందులో 33% అంటే 86 లేదా 87 స్థానాలను మహిళలకు రిజర్వేషన్ చేస్తారు. ఇక.. తెలంగాణలో ప్రస్తుతం 119 అసెంబ్లీ స్థానాలు, 17 లోక్ సభస్థానాలున్నాయి. తాజా నిర్ణయంతో అసెంబ్లీకి 179 స్థానాలు, లోక్ సభకు 26 సీట్లు పెరిగే అవకాశం ఉంది.

# ప్రభుత్వ ఉద్యోగులకు ఈవీ వాహనాలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలో వాతావరణ కాలుష్యాన్ని నివారించేం దుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) తీసుకువస్తున్నట్లు తెలిపారు. ₹1000 కోట్ల ఆదాయం నష్టమైనా ఈవీ వాహనాలు తీసుకొస్తున్నామని వివరిం చారు. హైదరాబాద్లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాలుష్యాన్ని నివారిం చాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమాన్ని తీసుకొ చ్చామన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఈవీ వాహనాలపై 20 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని ప్రకటించారు.సచివాలయంలో సిఎస్ రామకృష్ణ రావు, డీజీపీ శివధర్ రెడ్డి,రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, ఐ అండ్ పీఆర్ కమిషనర్ ప్రియాంక, ఉద్యోగ సంఘాల నేతల తో కలిసి మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ కాలుష్య రహిత రాష్ట్రంగా ఉండాలని ప్రయత్నిస్తున్నామని.. అందుకోసం ఈ ప్రయత్నం తీసుకువచ్చామని మంత్రి పొన్నం తెలిపారు. ఈవీ ఆటోలతోపాటు బస్సులను సైతం తీసుకుని వస్తున్నామన్నారు. నగరాన్ని క్యూర్ చేయాలని ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ఈవీ వాహనాలకు సబ్సిడీ ఇస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేశంలోని వివిధ ప్రధాన నగరాలు.. తీవ్ర కాలుష్యంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం వల్లే ఈ విధంగా తయారవుతున్నాయని ఇప్పటికే పలు అధ్యాయనాల ద్వారా వెల్లడైంది. ఈ నేపథ్యంలో వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది.



# నాది పరిష్కారం లేని సమస్య..

**జగిత్యాల,ఫ్లాష్ ఇండియా :** టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఎఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, విప్ ఆది శ్రీనివాస్ తో భేటీ అనంతరం మాజీ మంత్రి జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. నాది పరిష్కారం లేని సమస్య.. నా దగ్గరికి వచ్చి మాట్లాడిన వారి దగ్గర సైతం నా సమస్యకు పరిష్కారం దొరకలేదు.. ముందుగా చెప్పినట్లుగానే నా నిర్ణయాన్ని రేపు ప్రకటిస్తా భవిష్యత్తు ప్రయాణం ఎలా ఉంటుందో తెలియదు అంటూ పెద్దాయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ఉండి స్వపక్షంతో యుద్ధం చేయాలేనన్నారు.

**జీవన్ రెడ్డి రాజీనామా చేయరనే అనుకుంటున్నాం.. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్..**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయంగా తీసుకున్న కొన్ని నిర్ణయాల కారణంగా జీవన్ రెడ్డి ఇబ్బంది పడిన మాట వాస్తవమేనని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. 43 ఏళ్ల పాటు పార్టీలో సుదీర్ఘంగా పనిచేస్తున్న జీవన్ రెడ్డి వంటి సీనియర్ నాయకుల సేవలు పార్టీకి అవసరం అన్నారు. రాష్ట్రంలోనే అత్యంత సీనియర్ నేత అయిన జీవన్ రెడ్డిని వదులుకునేందుకు పార్టీ సిద్ధంగా లేదన్నారు. జీవన్ రెడ్డితో చర్చించిన విషయాలను పార్టీ హైకమాండ్ దృష్టికి తీసుకెళ్తామని ఆయన పార్టీకి రాజీనామా చేయరనే ఆశతోనే జగిత్యాల నుంచి తిరిగి వెళుతున్నట్లు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.

**జీవన్ రెడ్డి ఇంటి పై ఫ్లెక్సీలు చింపేసిన అనుచరులు..**

జీవన్ రెడ్డితో భేటీ అయిన టీపీసీసీ చీఫ్ ఇతర నాయకులు వెళ్లిన వెంటనే జీవన్ రెడ్డి ఇంటి పై ఏర్పాటు చేసిన ఇందిరా భవన్ పేరుతో ఉన్న ఫ్లెక్సీలను ఆయన అనుచరులు చించివేశారు. పదవులు ఆశించకుండా పార్టీ కోసం పనిచేస్తే మా నాయకుడికి ఇచ్చిన బహుమతి ఇదేనా అంటూ ఆయన అనుచరులు హై కమాండ్ తీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు.




# ఈసీఐ భారీ కసరత్తు..

**ఢిల్లీ:** నాలుగు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంత అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. దేశంలోని కీలక రాష్ట్రాలు అయిన పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, అస్సాం, పాండిచ్చేరిలో జరిగే ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం తన కసరత్తును ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా మంగళవారం ఢిల్లీ వేదికగా ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలు, వాటి సరిహద్దు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు , డీజీపీలు , రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారులు , హోంశాఖ ముఖ్య కార్యదర్శులతో కేంద్ర ఎన్నికల కమిషన్ ఒక కీలకమైన అంతర్రాష్ట్ర సరిహద్దు సమావేశాన్ని నిర్వహించింది. ఎన్నికల సమయంలో సరిహద్దుల గుండా జరిగే అక్రమ కార్యకలాపాలను అరికట్టడం, వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచడం, ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై ఉక్కుపాదం మోపడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యంగా ఎన్నికల సంఘం తెలిపారు. ఈ సమావేశంలో భాగంగా మల్టీ-డిపార్ట్మెంటల్ కమిటీ ఆన్ ఎలక్షన్ ఇంటెలిజెన్స్ తో కూడా ఎన్నికల సంఘం ప్రత్యేకంగా చర్చించింది. మద్యం, నగదు, మాదకద్రవ్యాల రవాణాను నియంత్రించేందుకు సరిహద్దు చెక్పోస్టుల వద్ద నిఘాను కట్టుదిట్టం చేయాలని, నిరంతరం సమాచార మార్పిడి జరుపుకోవాలని అధికారులను ఆదేశించింది. ఎటువంటి హింసకు తావులేకుండా, ప్రలోభాలకు గురి కాకుండా ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఈసీఐ స్పష్టం చేసింది. సరిహద్దు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారంతోనే ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణ సాధ్యమవుతుందని ఈ సందర్భంగా కమిషన్ గుర్తుచేసింది.

# మహేశ్వర్ రెడ్డికి సీతక్క కౌంటర్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గత పదేళ్లుగా వికలాంగులు, వితంతువుల పెన్షన్లు పెంచలేదు కానీ.. పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారంటూ బీజేపీ నేతలపై తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ శాసన సభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో మహేశ్వర్ రెడ్డికి సీతక్క కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కేంద్రం ఏ రకంగా మద్దతు ఇవ్వకున్నా ప్రజాసంక్షేమం కోసం తమ ప్రభుత్వం అధికంగా నిధులు వెచ్చిస్తుందన్నారు. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా.. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తెచ్చే బాధ్యత మీకు లేదా? అంటూ వారిని సూటిగా ప్రశ్నించారు.వ్యవసాయంపై కేంద్రం నల్ల చట్టాలు తీసుకు వస్తే.. దీనిపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటం చేశారన్నారు. దాంతో కేంద్రం వెనక్కి తగ్గిందని సీతక్క గుర్తు చేశారు. దేశంలో బడా పారిశ్రామికవేత్తలకు చెందిన రూ.16 లక్షల కోట్లను రుణమాఫీ చేశారు కానీ రైతు రుణమాఫీ మాత్రం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త రేషన్ కార్డు ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. వడ్డీ లేని రుణాల మీద తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ బీజేపీ నేతల వైఖరిని ఈ సందర్భంగా ఎండగట్టారు.బ్యాంకింగ్ రుణాల కింద రూ.58 వేల కోట్ల మంజూరు చేశామని సీతక్క గుర్తు చేశారు. అలాగే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామన్నారు. ఉచిత విద్యుత్, సన్న వడ్లతోపాటు రూ. నాలుగున్నర లక్షల కోట్లతో ఇందిరమ్మ ఇండ్లు కడుతున్నామని తెలిపారు. మీ ఊకదంపుడు ఉపన్యాసాలతో ప్రజలకు పని లేదన్నారు. రైతులకు ప్రతి నెల పెన్షన్స్ ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చిందన్నారు. అదే విధంగా విదేశాల్లోని నల్లధనాన్ని తెచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని ప్రకటించారని చెప్పారు.రూ. 50కే లీటర్ పెట్రోల్ ఇస్తామన్నారని సీతక్క గుర్తు చేశారు. కానీ పెట్రోల్ ధరలు ఇష్టారాజ్యంగా పెంచారంటూ కేంద్రంపై నిప్పులు చెరిగారు. విభజన హామీలు నెరవేర్చకుండా వట్టిగా ప్రసంగిస్తే ఏం ఉపయోగం అంటూ బీజేపీ నేతలకు ఈ సందర్భంగా సీతక్క చురకలంటించారు. తెలంగాణ ప్రజలు చెల్లించే పన్నులు కావాలి కానీ.. ఆ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు మాత్రం పట్టవా అంటూ బీజేపీ నేతలను ఈ సందర్భంగా నిలదీశారు.గత ప్రభుత్వ తీరు వల్ల ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలను తమ ప్రభుత్వం అమలు చేస్తుందని సీతక్క స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆర్థిక చేయూతతో నాలుగు లక్షల 70 వేల మంది మహిళలు వ్యాపారాలు చేసుకుంటున్నారని వివరించారు. కోటి మంది మహిళలు కోటీశ్వరులను చేస్తామని సంకల్పంతో తాము పని చేస్తున్నామన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఎగతాళి చేయడం మీకే చెల్లిందంటూ బీజేపీ శాసన సభ పక్ష నేత మహేశ్వరరెడ్డి తీరును ఈ సందర్భంగా మంత్రి సీతక్క ఎండగట్టారు.

# జీవో 76తో ఊరట..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో 2020 నుంచి పెండింగ్లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. శాసనమండలిలో సభ్యులు నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. గత ప్రభుత్వం సాదాబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించినప్పటికీ, 2020 ఆర్.ఓ.ఆర్ చట్టంలో వాటి పరిష్కార మార్గాన్ని చూపలేదని విమర్శించారు.

**జీవో 76తో ఊరట..**

సాదాబైనామా సమస్యకు పరిష్కారం చూపే క్రమంలో.. కొనుగోలుదారు, అమ్మకందారు ఇద్దరి నుంచి అఫిడవిట్ తీసుకోవాలన్న నిబంధన వల్ల క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని, ఇకపై కేవలం కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకోవాలని నిర్ణయించామని, ఈ మేరకు జీవో 76 (G.O. 76) విడుదల చేసినట్లు తెలిపారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న 9 లక్షలకు పైగా దరఖాస్తుదారులకు లబ్ధి చేకూరనుంది.

**ఆధార్ మాదిరిగానే 'భూధార్'..**

నక్షా లేని 413 గ్రామాలకు గాను 5 గ్రామాల్లో ప్రయోగాత్మకంగా రీ-సర్వే నిర్వహించామని మంత్రి తెలిపారు. ఇందులో ప్రతి సర్వే నెంబర్కు ఆధార్ నెంబర్ మాదిరిగానే 'భూధార్' కేటాయించినట్లు వెల్లడించారు. త్వరలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో, ఒక్కో జిల్లాలో 70 గ్రామాల చొప్పున భూ సర్వే నిర్వహించి, దశలవారీగా భూధార్ నెంబర్లు జారీ చేస్తామని, తద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు.

**అవినీతిపై ఉక్కుపాదం..**

ధరణి పోర్టల్లోని లోపాలను ఆసరాగా చేసుకుని కొంతమంది మీ-సేవ నిర్వాహకులతో కలిసి రూ. 3.99 కోట్ల ప్రభుత్వ సొమ్మును కాజేశారని, దీనిపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపిస్తున్నామని మంత్రి తెలిపారు. తప్పు చేసిన వారి నుంచి ఆ సొమ్మును రికవరీ చేస్తామని, ఇందులో అధికారుల పాత్ర ఉంటే ఏ స్థాయిలో ఉన్నా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఏప్రిల్ చివరి నాటికి పూర్తి స్థాయిలో 'భూ భారతి' పోర్టల్ను అందుబాటులోకి తెస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు.

# చీటింగ్.. ఫైటింగ్!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** చీటింగ్ బడ్జెట్ అంటూ బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్య లు అసెంబ్లీలో దుమారం రేపాయి. దీనిపై అధికార పక్షం ముప్పేట దాడికి దిగింది. పవిత్రమైన డాక్యుమెంట్ ను చీటింగ్ అని ఎలా అంటారంటూ నిలదీ శారు మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, జూపల్లి కృష్ణారావు. బడ్జెట్ పై చర్చ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ మూలధన వ్యయం సున్నా.. ఆరు గ్యారంటీలకు నిధులు కేటాయించలేదు.. అభయ హస్తం పేరుతో కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు కేటాయింపులు లేవు.. ఇందిరమ్మ ఇళ్లకు భారీ కోత విధించారు.. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకపోవడం వల్ల అనేక మంది చనిపోయారు... ఈ మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే.. గతంలో కేటాయించిన బడ్జెట్ లో 80% ఖర్చే చేయలేదన్నారు. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర అభ్యతరం తెలిపారు.. 'బడ్జెట్ పవిత్ర మైన డాక్యుమెంట్. బడ్జెట్ ను చీటింగ్ బడ్జెట్ అంటారా? తప్పు చెబితే చెప్పాలి.. బీటింగ్ పదాన్ని ఎందుకు వాడాలి? చీటింగ్ పదాన్ని రికార్డుల నుంచి తొలగించాలి' అని కోరారు. కాగ్ నివేదిక చూస్తే బడ్జెట్ అసలు రంగు బయ టపడుతుందని మహేశ్వర్ రెడ్డి అన్నారు. దేశంలో అతి తక్కువగా ఖర్చు చేసున్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. భట్టి, రేవంత్ మధ్య అగాధం లాగే లెక్కల మధ్య అగాధం కనిపి స్తోందని విమర్శలు చేశారు. రాష్ట్రం మొత్తం అప్పుల మీదే నడుస్తోందని విమర్శించారు. ఆర్బీఐ ద్వారా అప్పులు తీసుకుంటే తప్పారా ష్ట్రాన్ని నడపలేని పరిస్థితి ఉందన్నారు. తప్పుడు అంకెలతో సభను తప్పుదోవ పట్టించారని అన్నారు. మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యలపై సీతక్క ఫైర్ అయ్యారు. కేంద్రం ఇచ్చే దివ్యాంగుల 3 వందలు, వితంతువులు రెండు వందల ఫించన్ ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. రైతు నల్ల చట్టాలను తీసుకువచ్చింది బీజేపీ ప్రభుత్వ మని, వ్యవసాయం గురించి మాట్లాడే అర్హత బీజేపీకి లేదని అన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలు ఇవ్వలేదని ఆరోపిస్తున్నారని, చర్చకు సిద్ధం ఇప్పటి వరకు 57వేల కోట్ల రూపాయలు ఇచ్చామని చెప్పారు. "ఎనిమిది మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు కేంద్రం నుంచి తీసుకురండి' అంటూ ఫైర్ అయ్యారు. దీనిపై మహేశ్వర్ రెడ్డి స్పందిస్తూ 'కాంగ్రెస్ పార్టీ మాదిరిగా మేనిఫెస్టో రాయలేదు. హామీలు ఇవ్వలేదు తెలంగాణకు వివిధ సంక్షేమ పథకాల రూపంలో 80 శాతం నిధులు కేటాయించాం. కేంద్రం తెలంగాణకు ఎన్ని నిధులు ఇచ్చింది చర్చకు సిద్ధం. 57 వేల కోట్లు గ్రాంట్ల రూపంలో వచ్చాయి. కేంద్రం ఇన్ని రకాలుగా ఆదుకున్నా..

బద్నాం చేయడం సరైంది కాదు ఇచ్చిన హామీలను అమలు చేయమని కోరడం తప్పా. మా ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా కేంద్రంపైన నిందలు వేస్తున్నారు.' అని ప్రశ్నించారు. మజ్లిస్ కు మేలు చేయడం కోసమే జిహెచ్ఎంసీని మూడు కార్పొ రేషన్లుగా విభజిస్తున్నారని ఆరోపించారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారని అన్నారు.

# తెలంగాణ గవర్నర్ను కలిసిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్

**సికింద్రాబాద్,ఫ్లాష్ ఇండియా :** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మంగళవారం లోక్ భవన్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టుల పురోగతి, భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలపై గవర్నర్కు వివరించారు. తెలంగాణలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు తీసుకుంటున్న చర్యలపై ఆయన వివరించారు. గవర్నర్ ఈ సందర్భంగా రైల్వే శాఖ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రశంసిస్తూ, రాష్ట్ర అభివృద్ధికి రైల్వే రంగం కీలకమని పేర్కొన్నారు.



# అవసరం లేదు కానీ ఇస్తే మంచిదే



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ అధిష్ఠానం గతంలో కూడా హామీ ఇచ్చిందని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. హైకమాండ్ ఇప్పుడు ఏం చేస్తుందో తెలియదని చెప్పుకొచ్చారు. తాను మంత్రి పదవి కోసం పాకులాడటం లేదని పేర్కొన్నారు. ఈరోజు(మంగళవారం) అసెంబ్లీ మీడియా పాయింట్లో ఆయన మాట్లాడారు. ఏ పదవి లేకున్నా తనకి ప్రజల్లో తగిన గౌరవం ఉంటుందని స్పష్టం చేశారు.

**పార్టీకి మేలు..**

తనకు మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్కి, రాష్ట్ర ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే తన లాంటి తెలంగాణ ఉద్యమకారుల సేవలు అవసరమని తెలిపారు. తనకు సీఎం రేవంత్రెడ్డితో ఎలాంటి ఇబ్బంది లేదని క్లారిటీ ఇచ్చారు. నిన్న సీఎంతో ప్రత్యేకంగా ఏం భేటీ లేదని, ఎదురుపడితే పలకరించుకున్నామని చెప్పారు. మాజీమంత్రి కేటీఆర్తో ఇవాళ కూడా సాధారణంగా అన్ని విషయాలపై మాట్లాడానని వివరించారు. 2018 ఎన్నికల్లో 88 సీట్లు వచ్చిన తర్వాత కూడా 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తీసుకోవడం తప్పని కేటీఆర్కు చెప్పానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# ఏప్రిల్ 3న కలెక్టరేట్ ముట్టడి



**హిమాయత్నగర్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజుల బకాయిలు రూ.8 వేల కోట్లు వెంటనే చెల్లించాలని 100 బీసీ కాలేజీ హాస్టళ్లు, 119 బీసీ గురుకులాలు మంజూరు చేయాలని, బీసీ గురుకుల పాఠశాలలో 20 శాతం సీట్లు పెంచాలనే డిమాండ్ తో ఏప్రిల్ 3న డిమాండ్ల సాధనకై తరగతులు బహిష్కరించి కలెక్టరేట్లు ముట్టడించాలని తెలంగాణ బీసీ జాక్ చైర్మన్ ఎంపీ ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బీసీ విద్యార్థుల సమావేశం మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో బీసీ విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్ర శేఖర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించక పోవడంతో అష్టకష్టాల పాలు అవుతున్నారని అన్నారు. విద్యార్థులకు హాల్ టికెట్లు, సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఫీజుల స్కీమును ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నీరుగారుస్తుందని విమర్శించారు. ఎంఎల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ.. బడ్జెట్ లో బీసీలకు కేటాయింపులు, చెల్లింపుల్లో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. గత రెండు బడ్జెట్లలో బీసీలకు కేటాయించిన సొమ్ములో కేవలం రూ.5 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని అన్నారు. బీసీలను ఏకం చేసి పాలకుల కళ్ళు తెరిపిస్తామని, రాజ్యాధికార సాధన దిశగా ముందుకు సాగుతాం అన్నారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

# అదే కథ...అదే కత్తి..!

## టాలీవుడ్ ఎందుకు వెనుకబడుతోంది?
## మల్లూవుడ్, కోలీవుడ్ దూసుకెళ్తుంటే మనోళ్లకు మార్పు ఎందుకు లేదు?
## హీరోల ఎలివేషన్లేనా.. కథ, స్క్రీన్‌ప్లే ఎక్కడ?
## కొత్త కాన్సెప్టులు లేకుంటే టాలీవుడ్ భవిష్యత్తు ప్రశ్నార్థకమే!



అవే కథలు...అవే డైలాగ్‌లు...అదే స్క్రీన్ ప్లే...టాలీవుడ్ ఇంకెప్పుడు మారుతుంది ? వాట్సాప్‌లో వచ్చే కుళ్లు జోకులు...జబర్దస్త్ డబుల్ మీనింగ్ డైలాగ్‌లేనా ? కొత్త కాన్సెప్ట్‌లు...కొత్త స్టోరీలు మనకు దొరకవా ? లేదంటే మన దర్శకులు రాసే ప్రయత్నం చేయరా ? బాలీవుడ్, మల్లూవుడ్ దర్శకులకు డిఫరెంట్ స్టోరీలు ఎలా దొరుకుతున్నాయి ? టాలీవుడ్ సినిమాలు కొంతకాలంగా వరుసగా ఫ్లాప్ అవుతున్నాయి. తీసిన కథలే...తిప్పి తిప్పి మళ్లీ మళ్లీ తీస్తున్నారు. ఒక సినిమాలో పెట్టిన సీన్లనే సిగ్గు ఎగ్గు లేకుండా కాపీ కొట్టేస్తున్నారు. ఎవరేం అనుకుంటే మాకేంటి అన్నట్లు దర్శకులు, హీరోలు వ్యవహరిస్తున్నారు. కొత్తదనంతో సినిమా తీద్దాం...కొత్తగా డైలాగ్‌లు రాద్దామనే ఆలోచన అసలు లేదు. కొంచెం కూడా బుర్రకు పని చెప్పడం లేదు. నయా కాన్సెప్టుల గురించి ఆలోచించడం ఎప్పుడో మానేశారు. బాలీవుడ్, హాలీవుడ్, ఇండియన్ మూవీస్‌ను చూడటం...ఆ సినిమాలన్నింటిని కలిపి గ్రైండర్ వేయడంలో మన టాలీవుడ్ దర్శకులు ఆరితేరిపోయారు. కొందరు దర్శకులు పాత సినిమాల్లో కాన్సెప్టులను కాపీ కొట్టడం...దానికో కొత్త టైటిల్ పెట్టడం....పబ్లిసిటీ చేసుకోవడం కామన్ అయింది. టాలీవుడ్ దర్శకులు బుర్ర లేని వారని...తాము తీసే సినిమాలతో నిరూపించుకుంటున్నారు. ఇటీవల వచ్చిన సినిమాలే టాలీవుడ్ దర్శకులు పని తీరును నిరూపిస్తున్నాయి. మల్లూవుడ్, బాలీవుడ్ సినిమాలు కొత్త కాన్సెప్టులు....కథలు...డిఫరెంట్ స్క్రీన్ ప్లేతో దుమ్ము రేపుతున్నాయి. ఆడియెన్స్ కూడా ఆ సినిమాలకు బ్రహ్మరథం పడుతున్నారు. కలెక్షన్ల సునామీ సృష్టిస్తున్నాయి. థియేటర్లకు జనం క్యూకడుతున్నారు. కానీ మన దర్శకులు, హీరోలు మాత్రం మారడం లేదు. మేమింతే...మేం తీసిందే సినిమా...మేం చెప్పిందే కథ అంటున్నారు దర్శకులు...హీరోలు తానా అంటే...దర్శకులు తందానా అంటూ ఒకరికొకరు భజన చేసుకుంటున్నారు. టాలీవుడ్ హీరోలు...తమకు భజన చేసే దర్శకులకే పెద్ద పీట వేస్తున్నారు. కథ పాతదయినా...కాన్సెప్ట కొత్తగా లేకపోయినా...స్క్రీన్ ప్లే సో సో అయినా...తాము పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్నట్లు మన డబ్బా...పర డబ్బా...పరస్పర డబ్బా అన్నట్లు వ్యవహరిస్తున్నారు. మళయాళం, బాలీవుడ్ దర్శకులతో మనోళ్లు పోటీ పడలేకపోతున్నారు. వాళ్లే కలెక్షన్లు, కథలతో దూసుకుపోతుంటే...మనోళ్లేమో ఎక్కడ వేసిన గొంగలి అన్నట్లు పరిస్థితిని తయారు చేసుకుంటున్నారు. వాట్సాప్‌ల్లో వచ్చే కుళ్లు జోకులు....జబర్దస్త్‌లో వచ్చే డబుల్ మీనింగ్ కామెడీ సీన్లనే నమ్ముకుంటున్నారు. మన దర్శకులు సొంతంగా ఆలోచించడం ఎప్పుడో మానేశారు. సినిమాలో ఎంతసేపు హీరోల ఎలివేషన్లేనా. ఒక పిస్తల్‌తో వంద మందిని కాల్చేసే ఓవర్ యాక్షన్ సన్నివేశాలేనా. స్వకుచ మర్దనాలతో ఎంతకాలం గడుపుతారు. వీటి నుంచి తెలుగు సినిమా రంగం ఎప్పుడు బయట పడుతుంది. టాలీవుడ్ రేంజ్ ఎప్పుడు పెరుగుతుంది. చౌకబారు స్టోరీలు, రోత పుట్టించే డబుల్ మీనింగ్ డైలాగ్‌లు...మూసకథలు, భజన డైలాగ్‌లతోనే కాలం గడిపేస్తారా ? కొత్తగా నేర్చుకునే ప్రయత్నం చేయరా ? తమిళ్, మళయాళం, బాలీవుడ్ దర్శకులు...ఓ వైపు దూసుకుపోతున్నారు. డిఫరెంట్ ప్రజెంటేషన్...స్క్రీన్ ప్లేతో తలపండిన డైరెక్టర్లకే సవాల్ విసురుతున్నారు. నాలుగు కామెడీ సీన్ల చుట్టూ కాన్సెప్టును తయారు చేసుకోవడం...బడా హీరోల ఒప్పించి సినిమాలు తీస్తున్నారు. దాన్నే కొత్త కథ అంటూ ప్రేక్షకుల మీదకు వదులుతున్నారు. కొత్తదనం లేని కథలతో సినిమాలు తీస్తే...ప్రేక్షకులు ఎందుకు చూడాలి. కొంచెమైనా బుద్ధి ఉండక్కర్లేదా ? మనకు బుర్రలేదని చెప్పుకుంటున్నారు. అంతేకాదు...డైరెక్టర్లు సోమరిపోతుల్లా తయారవుతున్నారు. మనం ఇంకా వాట్సాప్ జోకులు... జబర్దస్త్ కామెడీల దగ్గరే ఆగిపోయాం. నాలుగు కామెడీ స్క్రిప్టు రాసుకొని ...దాని సినిమా తీస్తూ దౌర్భగ్యంలో ఉండిపోయాం. కొత్త కాన్సెప్టులు...కొత్త కథలు...కొత్త స్క్రీన్ ప్లేను ఎప్పుడు నేర్చుకుంటుంది. మన దర్శకులు ఎప్పుడు మారుతారు. ఓటీటీలు వచ్చాక...టాలీవుడ్ దర్శకులు డొల్లతనం...మేధావితనం బయటపడుతోంది. తమిళ్, మలయాళం దర్శకులు...చిన్న కాన్సెప్టుతోనే అదిరిపోయే సినిమాలు తీస్తున్నారు. అలా మన టాలీవుడ్ డైరెక్టర్లు ఆలోచిస్తారు. ఎంతసేపు భారీ బడ్జెట్లు...స్టార్ కాస్ట్....లోకేషన్లు...గ్రాఫిక్స్‌ను నమ్ముకోవడం మనేస్తారా ? మారుతున్న కాలానికి అనుగుణంగా కాన్సెప్ట...స్క్రీన్ ప్లే...కథలు రాసుకోకపోతే....అప్పట్లో ఒకటి ఉండేదని టాలీవుడ్ గురించి చెప్పుకోవాల్సిన పరిస్థితులు రావడం గ్యారెంటీ...అదెంతో కాలం లేదు....మల్లూవుడ్, కొలివుడ్‌ను చూసి...తెలుగు హీరోలు దర్శకులు ఎంతో నేర్చుకోవాలి. కాన్సెప్టులు, స్క్రీన్ ప్లే, టేకింగ్ విధానంలో టాలీవుడ్ చాలా వెనుకబడింది. భారీ బడ్జెట్లు...పెద్ద సెట్టింగ్‌లు...విదేశాల్లో షూటింగ్‌లు...టాలీవుడ్‌కు ఇవి మాత్రమే తెలుసా ? డైరెక్టర్లు...హీరోలు ఎప్పుడు మారుతారు ? ప్రేక్షకులు వినోదం కోసం, నిర్మాతలు రీమేక్ హక్కుల కోసం, ఫిల్మ్‌స్కూల్ విద్యార్థులు కేస్‌స్టడీ కోసం, రచయితలు వినూత్నమైన ఐడియాల కోసం.. కొత్త మలయాళ సినిమా ఎప్పుడు విడుదల అవుతుందా అని ఎదురుచూస్తుంటారు. కథలో కొత్తదనం, కథనంలో వైవిధ్యం, సంభాషణల్లో సహజత్వంతో.. భారతీయ సినిమా పరిశ్రమకు సరికొత్త ఫిల్మ్ మేకింగ్ పాఠాలు నేర్పుతోంది మాలీవుడ్. టాలీవుడ్ పాత కాన్సెప్టులతో తిరుగుతుంటే...మల్లూవుడ్, కొలీవుడ్, బాలీవుడ్ డైరెక్టర్లు మాత్రం రోజుకో కొత్త కాన్సెప్టుతో ప్రేక్షకులను మాయ చేస్తోంది. ఇలా కూడా సినిమాలను తీయవచ్చా అని కుళ్లు ? సున్నితమైన అంశాలను...తమ టేకింగ్‌తోనే అందరగొడుతున్నారు. టాలీవుడ్‌లో మాత్రం....ఎంతసేపు అవే కథలు. ఉస్తాద్‌భగత్, మన శంకర వరప్రసాద్...అన్ని హీరోల ఎలివేషన్ ఇచ్చేవి. దర్శకులు కూడా హీరోల భజనం చేయడంలో ముందుంటున్నారు. మలయాళం సినిమాల్లో భారీ బడ్జెట్‌లు ఉండవు. ఖరీదైన సెట్టింగులు...అసలు కనిపించవు. పంచ్ డైలాగులు...అన్నవే వినిపించవు. గ్రాఫిక్స్ మాయతో గారడి చేయవు. ఇవన్నీ లేకుంటే సినిమా ఎలా తీస్తారని అనుమానం రావొచ్చు. ఏ కథకైనా ఆత్మ ఉంటుంది. పాత్రల్లో జీవకళ తొంగిచూస్తుంది. సంభాషణల్లో సహజత్వం తొణికిసలాడుతుంది. ఆలూమగలు మాట్లాడుకున్నట్టూ, ప్రేమికులు ఊసులు చెప్పుకున్నట్టూ, ఇరుగుపొరుగు ముచ్చట్లు పెట్టుకున్నట్టూ అతి సహజంగా సాగి పోతాయి. కాకపోతే, కథ వేగం అందు కోడానికి కొంత సమయం పడుతుందంతే. కొన్నిసార్లు అసలు కథ అనేది ఉందా అనే అనుమానమూ కలుగుతుంది. అదే మలయాళం దర్శకుల మాయ. కథ ఉంటుంది...స్క్రీన్ ప్లే ఉంటుంది...సస్పెన్స్..సహజత్వం...ఇలా అన్ని ఉంటాయి. ఎక్కడా స్టార్లు కనిపించరు. అన్నీ పాత్రలే కనిపిస్తాయి. ఎవరూ నటించరు...ఆ పాత్రలో పరిపూర్ణంగా జీవిస్తారు. అదే మన తెలుగు సినిమాల్లో అయితే భారీ సెట్టింగ్‌లు....గ్రాఫిక్స్...డైలాగ్‌లు...ఇలా ఒకటేమిటి. అన్ని హీరోలకు ఎలివేషన్ ఇచ్చేవే. డైరెక్టర్లు కూడా హీరోలను దృష్టి పెట్టుకొనే కథలు రాస్తున్నారు. అహో ఓహో అనే రేంజ్‌లో భారీ డైలాగ్‌లు పెడుతున్నారు. తెలుగు సినిమాల్లో హీరోలే కనిపిస్తారు తప్పా...ఎక్కడ నటులు పాత్ర ఒదిగిపోయినట్లు చూపించరు. ప్రతి ఫ్రేమ్ కూడా హీరోనే సర్వంతర్యామి అనేలా బిల్డప్ ఇస్తున్నారు. అందుకే తెలుగు సినిమాలు బొక్క బోర్లా పడుతున్నాయి. మలయాళ చిత్రాలు మాత్రం...తెలుగు సినిమాల పోటీని తట్టుకుని థియేటర్లలో కలెక్షన్ల సునామీ సృష్టిస్తునాయి. ఓటీటీ క్లిక్కుల్లో దూసుకుపోతున్నాయి. మలయాళం దర్శకులు...సరికొత్త కాన్సెప్టులతో పోటీ పడుతున్నారు. ఏ ఇండస్ట్రీ సాటిరాని విధంగా...కథల ఎంపికలో, టేకింగ్‌తో..స్క్రీన్ ప్లేతో మల్లూవుడ్ దర్శకులు టాలెంట్‌కు పదును పెడుతున్నారు. తెలుగు సినిమాల్లో ఉన్నట్లు భారీ తారాగాణం ఉండదు...డబుల్ మీనింగ్ డైలాగ్‌లు అసలు ఉండవు. యాక్షన్ సీన్స్ కనిపించవు. హీరోలు కనిపించరు. కథ...పాత్రల చుట్టూ సినిమా తిరుగుతుంది. టాలీవుడ్‌లాగా స్వకుచ మర్దనాలు అన్నవి మచ్చుకైనా కనిపించవు. తెలుగులో హీరోల కోసం...హీరోలు చుట్టూ....స్టోరీ మొత్తం తిరిగేలా స్టోరీలను రాసుకుంటున్నారు. కానీ మళయాలంలో కథ బలం. తెలుగులో అయితే హీరోనే బలం. ఇలా ఉంటే సినిమాలు ఎలా హిట్టవుతాయి. నిర్మాతలకు ఎలా డబ్బులు వస్తాయి. దీన్ని మాత్రం మన దర్శకులు ఆలోచించే ప్రయత్నం చేయరు. తెలుగు వార్తలుమలయాళ దర్శకులు తక్కువ బడ్జెటతో భారీ కలెక్షన్లు రాబడుతున్నారు. అక్కడి డైరెక్టర్లకు దొరుకుతున్న కథలు మనకు ఎందుకు కనిపించడం లేదు. వాళ్లలా మన దర్శకులు ఆలోచించడం లేదు. కొత్త కాన్సెప్టులు ముట్టుకుంటే పరాభవం ఎదురవుతుందని భయపడుతున్నారు. 2018 నూట డెబ్బై అయిదు కోట్లు కొల్లగొట్టడమే కాదు.. ఆస్కార్‌కూ షార్ట్‌లిస్ట్ అయ్యింది. ప్యారడైజ్ అనే సినిమా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో కూడా ఆడింది. దృశ్యం సిరిస్ ఎన్ని రికార్డులు సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మాలీవుడ్‌లో భారీ బడ్జెట్ చిత్రాలు తక్కువే. ఫారిన్ లొకేషన్లూ, ఖరీదైన సెట్టింగులూ పెద్దగా కనిపించవు. చాలా సినిమాలు ఓ పల్లె చుట్టుపక్కలో, ఓ ఇంటి పరిసరాల్లోనో తిరుగుతాయి. జీరో సైజ్ హీరోయిన్లూ, సిక్స్‌ప్యాక్ హీరోలూ వాళ్ల కాస్టింగ్ లిస్ట్‌లో ఉండరు. కాస్ట్యూమ్స్ ఖర్చూ నామమాత్రమే. పురుషులైతే లుంగీలదే హంగామా. స్త్రీ పాత్రలకు నైటీలతోనే తెల్లారిపోతుంది. పాడుబడిన బంగళాలో పద్దెనిమిదో శతాబ్దపు వాతావరణంలో, మూడునాలుగు పాత్రలతో నిర్మించిన మమ్ముట్టి నలుపు తెలుపు సినిమా భ్రమయుగం వందకోట్ల క్లబ్‌లో చేరింది. ప్రమాదంలో చిక్కుకున్న మిత్రుడి కోసం ఓ స్నేహబృందం పడిన తపన మంజుమ్మల్ బాయ్స్ పేరుతో రెండొందల కోట్ల వసూళ్లు సాధించింది. ఇలాంటి కొత్త కాన్సెప్టులతో తెలుగులో ఎన్ని సినిమాలు వచ్చాయి ? ఎంత మంది హీరోలు కొత్తదనానికి రెడ్ కార్పెట్ పరిచారంటే సమాధానం లేదు. అలాంటి ప్రయత్నం చేయడానికి కూడా సాహసించడం లేదు. ఇచ్చి పడేసే గోత్రం.. ఇరగదీసే నక్షత్రం...అంటే ప్రేక్షకులు కలెక్షన్లు ఇచ్చేస్తారా ? సినిమాలను హిట్ చేస్తారా ? కథ, కథనం అక్కర్లేదా ? మలయాళం దర్శకుల రాని కథల కొరత మనకే ఎందుకు వస్తోంది ? కొత్త కాన్సెప్టులకు ఆహ్వానం పలకకపోతే...టాలీవుడ్ దర్శకులు దుకాణం బంద్ చేసుకోవాల్సిందేనా? హాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు ప్రతి పరిశ్రమనూ కథల కొరత వేధిస్తూనే ఉంటుంది. ఎవరి పద్ధతిలోవారు స్టోరీలను వండివార్చుకుంటారు. ఈ విషయంలో మల్లూవుడ్‌కు ట్రేడ్‌మార్క్ ఫార్ములా ఉంది. తనకంటూ ఓ నియమం పెట్టుకుంది. ఇక్కడ ఫారిన్ సరకును రీసైకిల్ చేయరు.

బ్లాక్ అండ్ వైట్ సినిమాల సీన్లు చించేసి వాడుకోరు. ప్రతికథకూ జీవితమే నేపథ్యం. ప్రతిపాత్రా జనంలోంచి పుడుతుంది. నిజానికి మనకు కథల కొరత లేదు. ఉన్నదంతా ఆలోచనల కొరతేనని...మలయాళ సినిమాలు చూసిన వారికి అర్థం అవుతుంది. మలయాళ సినిమా సాధించాల్సింది ఇంకా చాలా ఉందని అక్కడి దర్శకులు చెబుతున్నారు. కొంతకాలంగా ప్రేక్షకుల అభిరుచులు వేగంగా మారిపోతున్నాయి. వాస్తవానికి దగ్గరగా ఉన్న కథలనే ఇష్టపడుతున్నారు. ప్రస్తుతం మలయాళ పరిశ్రమ ఆ ట్రెండ్‌ను కొనసాగిస్తోంది. మన దర్శకులు మాత్రం...ఊహల్లో తేలిపోతున్నారు. హీరోలతో పంచ్ డైలాగ్‌లు చెప్పించడానికి ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. తెలుగు పరిశ్రమలో హీరోల పారితోషికమే పావువంతు ఉంటుంది. అదనంగా పంపిణీ హక్కులు అడుగుతారు. పైగా తాను సూచించిన సహనటులే ఉండాలి...నిర్మాతలుగా తమ కుటుంబసభ్యులే ఉండాలి...చెప్పుకుంటూ పోతే ఎన్నో కండిసన్లు పెడతారు. అందుకే తెలుగు సినిమాల్లో కొత్తదనం ఉండటం లేదు. ప్రేక్షకులు కూడా సినిమాలను బండకేసి కొడుతున్నారు. కనీసం వారం కూడా థియేటర్లలో ఆడటం లేదు. హీరోలు, దర్శకులు...ఆలోచనా విధానం మారాలి. హీరోలు, దర్శకులు కొత్త దనానికి స్వాగతం పలకాలి. నయా కాన్సెప్టులతో వచ్చే దర్శకులను ప్రోత్సహించాలి. అప్పుడే తెలుగు సినిమా రంగం బాగుపడుతుంది. మలయాళం ఇండస్ట్రీలో హీరోల బాధ అసలే ఉండదు. సూపర్‌స్టార్ల రెమ్యునరేషన్లు చిన్న నిర్మాతలకూ అందుబాటులో ఉంటాయి. దీంతో నిర్మాణ ఖర్చులు అదుపు తప్పవు. అదే సమయంలో రచయితలకు ఏమాత్రం తక్కువ చేయరు. ఫలితంగా నాణ్యమైన స్క్రిప్ట్లు వస్తున్నాయి. కథ, కథనం, స్క్రీన్ ప్లే, పరిశోధన.. ఇలా దర్శకుడే సకల బాధ్యతలనూ తీసుకోవాలని అనుకోడు. కథ అల్లేవాడు కథ మీదే దృష్టి పెడతాడు. దర్శకుడి పని దర్శకుడిదే. అన్నిటికీ మించి హీరోలు ఇమేజ్ చట్రంలో చిక్కుకుపోరు. కాబట్టే, సూపర్ స్టార్ మమ్ముట్టి స్వలింగ సంపర్కుడి పాత్ర పోషించగలిగాడు. ఫహాద్ ఫాజిల్ సైకో పాత్రలకు ఒప్పుకున్నాడు. మమ్ముట్టి చేసిన గే పాత్ర అయినా....ఫహద్ ఫాజిల్ చేసిన సైకో పాత్ర అయినా...తెలుగు ఏ హీరో చేయగలడు. చేసే దమ్ము...ఎంత మందికి ఉంది అంటే సమాధానం లేదు. కథల ఎంపికలోనే మనకు సరైన క్లారిటీ ఉండటం లేదు. అలాంటపుడు సినిమాలు ఎలా హిట్టవుతాయి. తెలుగు వార్తలుఅంధురాలైన ఓ శిల్పకారిణి తనపై జరిగిన అఘాయిత్యాన్ని కోర్టుకు ఎలా వివరిస్తుంది ? అనే కోణంలో సాగే నేరు మూవీలో... మోహన్‌లాల్ నటనా కౌశలానికి అద్దం పడుతుంది. సురేశ్ గోపి హీరోగా వచ్చిన గరుడన్ ఓ వినూత్న ప్రయోగం. సగం సినిమా ఒక కోణంలో సాగుతుంది. ఒక పాత్రను ద్వేషిస్తాం. మరో సగం ఇంకో కోణంలో నడుస్తుంది. అదే పాత్రను ప్రేమిస్తాం. ప్రేక్షకుల ఎమోషన్స్‌తో ఆడుకోవడం మలయాళ దర్శకులకు బాగా తెలుసు. గ్రేట్ ఇండియన్ కిచెన్..

వంటింట్లో నలిగిపోతున్న ఓ యువతి హృదయాన్ని ఆవిష్కరించింది. మలిసంధ్యలో ఒంటరి జీవితం గడుపుతున్న ఓ తండ్రి, తన కొడుకు రూపొందించిన రోబోతో అనుబంధాన్ని ఎలా పెంచుకుంటాడో ఆండ్రాయిడ్ కుంజప్పన్ వెర్షన్ 5.25లో చూపించారు. ఇలాంటి సినిమాలు మలయాళంలో తప్పించి ఎక్కడా తీయరు, తీయలేరు కూడా. గోట్ లైఫ్ మూవీ ఎన్నో రికార్డులు సృష్టించింది. దాదాపు పదహారేళ్ల పాటు ఈ చిత్రం కోసమే పనిచేశారు దర్శకుడు బ్లెస్సీ. ఎంత ఒత్తిడి వచ్చినా సరే, ఇంకో ప్రాజెక్ట్ తీసుకోలేదు. సినిమాపై అంత ఫోకస్ చేసినందునే...భారీ కలెక్షన్లు సాధించింది. గోట్ లైఫ్ సరికొత్త బెంచ్‌మార్క్‌గా నిలిచింది. అయ్యప్పన్ కోషియమ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఒక పోలీస్ ఆఫీసర్, రిటైర్డ్ ఆర్మీ పర్సన్‌లు ఒకరికొకరు ఢీ అంటూ పవర్, ఈగో, బలాబలాలను చూపించుకుంటుంటారు. సినిమా ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. ఈ చిత్రాన్నే తెలుగులో భీమ్లా నాయక్ గా రీమేక్ చేశారు. మలయాళంలో హిట్టయిన ఎన్నో సినిమాలను...తెలుగులో రీమేక్ చేశారు. కొన్నింటిని డబ్బింగ్‌తో రిలీజ్ చేశారు. అన్ని హిట్ అయ్యాయి. అలాంటి పని తెలుగు దర్శకులు ఎందుకు చేయడం లేదంటే సమాధానాలు లేవు. తెలుగు ప్రేక్షకులు...మళయాళం, తమిళ సినిమాలకు బాగా అలవాటు పడుతున్నారు. కాన్సెప్ట్, కథ, స్క్రీన్‌ప్లేను ఎక్కువగా చూస్తున్నారు. ఓటీటీలు వచ్చిన తర్వాత మళయాళం, తమిళ సినిమాలకు ఫుడ్ డిమాండ్ పెరిగింది. మలయాళం సినిమాలతో పాటు సిరీస్‌లను జనం వదిలి పెట్టడం లేదు. తెలుగు ప్రేక్షకులు బాగా కనెక్ట్ అయ్యారు. ఇప్పటికే టాలీవుడ్ హీరోలు, దర్శకులు...

కొత్త కాన్సెప్టులు...కథ, స్క్రీన్‌ప్లే ఫోకస్ చేయకపోతే...హీరోలు, దర్శకులను పట్టించుకోవడం మానేస్తారు. ఎలాగో ఓటీటీలు ఉన్నందున... చక్కగా మలయాళం, కొలీవుడ్, బాలీవుడ్ సినిమాలనే చూస్తారు. ఇప్పటికైనా టాలీవుడ్ హీరోలు, దర్శకులు ఆలోచనా విధానం మార్చుకోవాలి...అవే డైలాగ్‌లు...అదే కామెడీ డైలాగ్‌లు చెబితే...ప్రేక్షకుల చేత పరాభవం తప్పదు.

సంపాదకీయం పేజీలో రచనలు పంపవలసిన వాట్సప్ నంబర్ ,మెయిల్ ఐడి
**9951512539**
**flashindia999@gmail.com**

# మారనున్న రాష్ట్ర ముఖచిత్రం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రం తన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సరికొత్త రహదారి వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. 'తెలంగాణ రైజింగ్- విజన్ 2047'లో భాగంగా ప్రభుత్వం ప్రతిపాదించిన గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్లు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి సరికొత్త చోదక శక్తులుగా మారనున్నాయి. ఔటర్ రింగ్ రోడ్, రాబోయే 360 కి.మీ. రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్)లను అనుసంధానిస్తూ నిర్మిస్తున్న ఈ రహదారులు భవిష్యత్తు రవాణా అవసరాలను తీర్చడమే కాకుండా పారిశ్రామికాభివృద్ధిలో కీలక పాత్ర పోషించనున్నాయి.ఇవి సాధారణ రహదారులకు భిన్నంగా గ్రీన్ ఫీల్డ్ రోడ్లు నగరంలోని రద్దీ ప్రాంతాలను తాకకుండా, వేగవంతమైన ప్రయాణానికి వీలు కల్పిస్తాయి. రాష్ట్రంలోని కోర్ అర్బన్, పెరి-అర్బన్, రూరల్ అగ్ని ప్రాంతాలను అనుసంధానిస్తాయి. ప్రభుత్వం వీటిని హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో అభివృద్ధి చేస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా (హబ్) ఉంటే ఈ 10 రోడ్లు వివిధ దిశల్లో వెళ్లే స్పోక్స్‌గా పనిచేస్తాయి.

**భారత్ ఫ్యూచర్ సిటీ మీదుగా..**

రేడియల్ రోడ్ నంబర్ 1ను 41.5 కి.మీ. పొడవైన సిక్స్ లేన్ ఎక్స్‌ప్రెస్‌వేగా నిర్మిస్తున్నారు. ఔటర్ రింగ్ రోడ్‌లోని రావిర్యాల్ జంక్షన్‌ను రీజినల్ రింగ్ రోడ్‌ను ఆమన్‌గల్ వద్ద ఈ రోడ్డు కలుపుతుంది. ఇది భారత్ ఫ్యూచర్ సిటీ గుండా వెళ్తుంది. ప్రస్తుతం ఈ రేడియల్ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. అలాగే 81 కి.మీ. మేర విస్తరించి ఉండే రేడియల్ రోడ్ నంబర్- 2 బుద్వేల్ వద్ద ఓఆర్ఆర్ నుంచి ప్రారంభమవుతుంది. ఆర్ఆర్ఆర్ మీదుగా కొడంగల్ నియోజకవర్గంలోని నాచారం వద్ద ఎన్‌హెచ్-167ఎన్‌తో కలుస్తుంది. దీనివల్ల పరిశ్రమలకు రవాణా వ్యయం తగ్గనుంది.అలాగే లగచర్ల ఎడ్యుకేషన్ హబ్‌కు ప్రయాణం సులువవుతుంది. ఇప్పటికే మొదటి రెండు రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. అలాగే ఈ మొత్తం 10 రహదారుల వెంబడి ప్రభుత్వం 10 అత్యాధునికమైన నెట్-జీరో టౌన్‌షిప్‌లను నిర్మించనుంది. ఇవి పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా, పరిశ్రమలకు సమీపంలోనే నివాస ప్రాంతాలను ఏర్పాటు చేయడం ద్వారా నడుస్తూ పనికి వెళ్లే (వాక్-టు-వర్క్) సంస్కృతిని ప్రోత్సహిస్తాయి.

1. రావిర్యాల్ (ఓఆర్ఆర్) - ఆమన్‌గల్ (ఆర్ఆర్ఆర్)
2. బుద్వేల్ (ఓఆర్ఆర్) - నాచారం (ఆర్ఆర్ఆర్)
3. కొండకల్ (ఓఆర్ఆర్) - సంగారెడ్డి (ఆర్ఆర్ఆర్)
4. సుల్తాన్‌పూర్ (ఓఆర్ఆర్) - నర్సాపూర్ (ఆర్ఆర్ఆర్)
5. మేడ్చల్ (ఓఆర్ఆర్) - తూప్రాన్ (ఆర్ఆర్ఆర్)
6. కీసర (ఓఆర్ఆర్) - గజ్వేల్/ప్రజ్ఞాపూర్ (ఆర్ఆర్ఆర్)
7. ఘటకేసర్ (ఓఆర్ఆర్) - భువనగిరి (ఆర్ఆర్ఆర్)
8. గౌరెల్లి (ఓఆర్ఆర్) - చౌటుప్పల్ (ఆర్ఆర్ఆర్)
9. బొంగులూరు (ఓఆర్ఆర్) - ఇబ్రహీంపట్నం/మల్లేపల్లి (ఆర్ఆర్ఆర్)
10. శంషాబాద్ (ఓఆర్ఆర్) - షాద్‌నగర్ (ఆర్ఆర్ఆర్)



# ఫలించని చర్చలు..?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** జగిత్యాలలో జీవన్ రెడ్డితో పీసీసీ అధ్యక్షులు మహేష్ భేటీ ముగిసింది. పార్టీలో కొనసాగండి, పార్టీని వీడకండి. భవిష్యత్తుపై చర్చిద్దామని పీసీసీ చర్చలు జరిపారు. ఏఐసీసీ నాయకులు సైతం పార్టీలోనే కొనసాగాలని జీవన్ రెడ్డిని కోరారు. భేటీ అనంతరం మహేష్‌గౌడ్ మాట్లాడారు. "జీవన్ రెడ్డి మా తండ్రి సమానులు. 43 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఆయనది. రాష్ట్రంలో అంతకన్నా సీనియర్ నాయకులు లేరు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొంత ఇబ్బంది పడ్డారు. ఈ వయసులోనూ ఇబ్బంది పడ్డారు. కొన్ని సార్లు రాజకీయంలో అనుకోని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. జీవన్‌రెడ్డి ఇబ్బందుల్లో ఉన్నారు కాబట్టి నా సూచనల మేరకు మంత్రి శ్రీధర్ బాబు వచ్చారు. నేను కూడా ఈ రోజుల కలిశాను. కాంగ్రెస్‌తో అనుబంధాన్ని తెంచొద్దని, మమ్మల్ని వీడొద్దని వారికి విన్నవించడం జరిగింది. కార్యకర్తల ఒత్తిడి తదితర కారణాల వల్ల వారు ఈ నిర్ణయం తీసుకుంది. వారు పార్టీలోనే ఉండాలని ఏఐసీసీ పట్టుబడుతోంది. నాకు జీవన్‌రెడ్డితో 1986 నుంచి పరిచయం. అప్పటి నుంచి మాకు రాజకీయంగా సలహాలు ఇచ్చారు" అని తెలిపారు. జీవన్ రెడ్డి రాజీనామా చేయరు అనే ఆశతో ఇక్కడి నుంచి వె ళ్తున్నామని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు.ఇక ఈ భేటీ అంనంతరం ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. ఈ చర్చలు ఫలించలేదు. జీవన్‌రెడ్డి ఇంటిపై ఉన్న కాంగ్రెస్ ప్లేక్సీని అభిమానులు తొలగించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "ఇది పరిష్కారం లేని సమస్యగా మారింది.. సమస్యకు పరిష్కారం నా దగ్గర లేదు.. వారి దగ్గర కూడా లేదు. రేపు 10 గంటలకు కార్యకర్తలు అందరు భేటీ అవ్వండి. గార్డెన్‌కి రండి.. రేపు భవిష్యత్తు, పయనం ఎలా ఉంటుందో తెలియదు.. కాంగ్రెస్ పార్టీలో ఉండి స్వపక్షంతో యుద్ధం నేను చేయలేను. నేను నా నిర్ణయం రేపు ప్రకటించబోతున్న.. నా నిర్ణయం దైవ నిర్ణయంగా భావిస్తున్నా." అని జీవన్‌రెడ్డి తెలిపారు. ఇక కాంగ్రెస్‌కు రేపు జీవన్‌రెడ్డి రాజీనామా చేయనున్నట్లు తెలుస్తోంది.

# ఖాతాల్లోకి రైతు భరోసా

## తొలిదశగా ఎకరానికి రూ.6వేల చొప్పున ప్రతీ రైతుకు జమ



**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** రైతులకు పెట్టుబడిసాయంగా అందజేస్తున్న రైతుభరోసా సొమ్ములను రాష్ట్ర ప్రభుత్వం దశలవారీగా ఖాతాల్లో జమచేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఆదివారం సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా.. ఆదివారం సెలవు కావడంతో.. సోమవారం నుంచి సొమ్ములను రైతుల ఖాతాల్లో జమచేసే ప్రక్రియను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో తొలిదశగా ఎన్ని ఎకరాలున్నా సరే.. ప్రతీ రైతుకు ఎకరానికి రూ.6వేల చొప్పున జమచేశారు. ఉదాహరణకు ఐదెకరాలు సాగుచేస్తున్న రైతుకు కూడా ఎకరం భూమికి మాత్రమే రైతభరోసా జమచేశారు.45రోజుల్లో మూడువిడతల్లో మొత్తం రైతుభరోసా సొమ్ములను జమకాబోతోంది. అంటే మరో 20రోజుల్లో రెండో విడత, 45రోజుల్లో మూడో విడత సొమ్ములు అందించనున్నారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలో సోమవారం 3,03,562మంది రైతులకు రూ.169.35కోట్లు జమయ్యాయి. మొత్తం 3,58,753మంది రైతులకుగాను రూ.440.63కోట్లు జమకావాల్సి ఉంది. అయితే కొన్ని బ్యాంకు ఖాతాల్లో తప్పులు, ఆధార్ లింక్‌కాకపోవడంతో తొలిరోజు కొన్ని ఖాతాల్లో డబ్బులు జమకాలేదు. వాటిని కూడా త్వరితగతిన క్లియర్ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

**భద్రాద్రి జిల్లాలో రూ. 98.75కోట్లు..**

కొత్తగూడెం వ్యవసాయం: రైతు భరోసా పథకంలో భాగంగా తొలి రోజు భద్రాద్రి జిల్లాలో 1,77,201 మంది రైతులకు సంబంధించి 5.85లక్షల ఎకరాలకుగాను రూ 315.55 కోట్లను జమ చేయాల్సి ఉంది. కాగా మొదటిరోజున ఒక ఎకరానికి గాను 1,77,201 మంది రైతులకు రూ98.75 కోట్లను జమ చేశారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు తెలిపారు.

# సర్కారీ చదువుల్లో సరికొత్త విప్లవం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో ప్రభుత్వ స్కూళ్లలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్య అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం 2026-27 నుండి రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌లను ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఇప్పటికే రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని ఆరుట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ కు మంచి స్పందన వచ్చింది. అంతర్జాతీయ హంగులతో ఏర్పాటైన ఈ పాఠశాలలో ప్రభుత్వ ఉద్యోగులు సైతం తమ పిల్లలను చదివిస్తున్నారు. దీంతో ఆరుట్ల పబ్లిక్ స్కూల్ తరహాలోనే కొత్తగా వంద నియోజకవర్గాల్లో పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**ప్రత్యేకతలు ఇవే..**

తెలంగాణ పబ్లిక్ స్కూల్లు సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా పనిచేస్తాయి. ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ అందిస్తారు. నర్సరీలో చేరితే పదోతరగతి లేదా ఇంటర్ వరకు చదువుకోవచ్చు. ఒకే గ్రామంలో వేర్వేరు చోట బడులు, జూనియర్ కాలేజీలుంటే ఒకే ప్రాంగణంలో ఉండేలా చర్యలు తీసుకుంటారు. ఇంగ్లీష్ మీడియంలో విద్య అందిస్తారు. ఇతర గ్రామాల నుండి వచ్చే విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పిస్తారు. ప్రాథమిక పాఠశాలలో ఒక్కో తరగతికి ఒక టీచర్ ను నియమిస్తారు. నాణ్యమైన విద్యతో పాటు క్రీడలకూ సమానంగా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. సైన్స్, మ్యాథ్స్, ఇంగ్లీష్ ల్యాబులు అందుబాటులో ఉంటాయి. ఒక ఇంటర్నేషనల్ స్థాయి స్కూళ్లో ఎలాంటి సౌకర్యాలుంటాయో అవన్నీ తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో ఉండనున్నాయి.

**వచ్చే ఏడాది నుంచే..**

రాష్ట్రవ్యాప్తంగా 2026-27 విద్యా సంవత్సరం నుండి 100 నియోజకవర్గాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభం కానున్నాయి. ప్రతి పాఠశాలలో సుమారు 1500 మంది విద్యార్థులు ఈ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి (ఇంటర్మీడియట్) వరకు ఒకే చోట విద్య అందుబాటులో ఉంటుంది. ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, ల్యాబ్‌లు, లైబ్రరీలు, క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్కూల్ బస్సు నెట్‌వర్క్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టబోతోంది. 2026-27 విద్యా సంవత్సరం నుండి రాష్ట్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను గజ్వేల్ నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం భావించింది. గజ్వేల్‌లోని టీపీఎస్ ప్రీ-ప్రైమరీ నుండి 8వ తరగతి వరకు తరగతులతో ప్రారంభమవుతుంది. కాగా 9వ తరగతి నుండి 12వ తరగతి వరకు ఉన్నత తరగతులు 2027-28 విద్యా సంవత్సరంలో మొదలవుతాయి.

# పుకార్లను నమ్మొద్దు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పశ్చిమాసియా (ఇరాన్-ఇజ్రాయెల్) యుద్ధం ఉద్రిక్తతల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో ఇంధన, గ్యాస్ కొరత ఏర్పడింది. ముఖ్యంగా అనేక పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు పెడుతున్నారని వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ వార్తలపై నగరి సీపీ సజ్జనార్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. హైదరాబాద్‌లో ఇంధన, గ్యాస్ కొరత లేదు.. పుకార్లను నమ్మవద్దని స్పష్టం చేశారు. ఆయన తన ట్వీట్‌లో "హైదరాబాద్ నగరంలో పెట్రోల్, డీజిల్ మరియు ఎల్పీజీ సిలిండర్ల కొరత ఉందని వస్తున్న వార్తలను నగర పోలీసులు కొట్టిపారేశారు. నగరవ్యాప్తంగా తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని, సరఫరా ఎక్కడ ఆగిపోలేదని స్పష్టం చేశారు.పశ్చిమాసియా (ఇరాన్-ఇజ్రాయెల్) యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధన సరఫరా నిలిచిపోతుందనే తప్పుడు ప్రచారంతో ప్రజలు ఒక్కసారిగా పెట్రోల్ బంకులకు క్యూ కట్టడం వల్ల అనవసరపు రద్దీ ఏర్పడుతోందని సీపీ పేర్కొన్నారు. ప్రజలు ఆందోళనతో ఇంధనాన్ని నిల్వ చేసుకోవద్దని, దీనివల్ల సాధారణ సరఫరా వ్యవస్థకు ఆటంకం కలుగుతుందని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే నగరంలోని తాజా పరిస్థితిని హైదరాబాద్ సిటీ పోలీస్ యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందని, పౌరసరఫరాల శాఖతో సమన్వయం చేసుకుంటూ సరఫరా సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటున్నామని సీపీ సజ్జనార్ తెలిపారు.అలాగే ఇలాంటి పుకార్లను ఎవరైనా వ్యాప్తి చేసిన, కృత్రిమ కొరత సృష్టించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని, శాంతియుతంగా ఉంటూ అధికారులకు సహకరించాలని వారు కోరారు. హోటళ్లు, రెస్టారెంట్ల కోసం వాడే కమర్షియల్ గ్యాస్ సరఫరాపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, గృహ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారని ఈ సందర్భంగా సజ్జనార్ తన ట్వీట్ ద్వారా చెప్పుకొచ్చారు.

# గ్యాస్ కొరత తీవ్రంగా ఉంది..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల కొరతను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఇవాళ అసెంబ్లీ సమీపంలోని గన్‌పార్క్ వద్ద భారీ నిరసన చేపట్టింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అంతర్జాతీయంగా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ప్రజలు గ్యాస్ సిలిండర్ల కోసం అల్లాడిపోతున్నారని ఫైర్ అయ్యారు. కేంద్ర ప్రభుత్వం కొరత లేదని నమ్మబలుకుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం సామాన్యులకు సిలిండర్లు దొరకడం లేదని ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వం ఎల్‌పీజీ కొరత లేదంటుందని.. రాష్ట్ర ప్రభుత్వం పెట్రోలియం శాఖ తమ చేతుల్లో లేదని తప్పించుకుంటుందని కేటీఆర్ అన్నారు. వీరిద్దరి తీరు చూస్తుంటే ఆంబోతుల కొట్లాటలో లేగ దూడలు బలైనట్లుగా సామాన్య ప్రజల పరిస్థితి తయారైందని విమర్శించారు. భవిష్యత్తులో గ్యాస్ సిలిండర్ పరిమాణాన్ని 14 కిలోల నుంచి 10 కిలోలకు తగ్గించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఇది ప్రజలను మరింత ఇబ్బంది పెట్టడమేనని అన్నారు. గ్యాస్ సరఫరాపై ఉన్న అయోమయాన్ని తొలగించేలా ప్రభుత్వం తక్షణమే ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని గ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# టెండర్ లో కాంట్రాక్టర్లు కుమ్మక్కు

**నల్లగొండ,ఫ్లాష్ ఇండియా :** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామంలో నిర్వహించిన సంత వేలం పాటలో కాంట్రాక్టర్లు కుమ్మక్కైనట్లు తెలుస్తోంది. గత ఏడాది కొండమడుగు సంత వేలం పాట ద్వారా లభించిన ఆదాయం కంటే తక్కువ మొత్తానికి కాంట్రాక్టర్లు కొట్టేసే విధంగా ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. అయితే గత ఏడాది కొండమడుగు గ్రామపంచాయతీకి అంగడి వేలం పాట ద్వారా రూ. 91 లక్షల ఆదాయం వచ్చింది. ఆ కాంట్రాక్టు మార్చి 31 తో ముగియనుంది. అయితే ఈ ఏడాది 2026-27 సంవత్సరానికి సంబంధించిన అంగడి వేలం పాట మార్చి 3 తేదీన నిర్వహించారు.సుమారు 69 మంది కాంట్రాక్టర్లు టెండర్ దాఖలు చేసినట్లు తెలిసింది. కానీ ఆ టెండర్ పాటలు కేవలం నలుగురు, ఐదుగురు మాత్రమే ప్రత్యక్షంగా వేలం పాట కొనసాగించారని తెలిసింది. టెండర్ లో పాల్గొన్న వాళ్లు లక్ష రూపాయలు డిపాజిట్ తో పాటు ఐదు లక్షలు కింద చెల్లిస్తారు. ఈ వేలం పాటలో ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ.80.10 లక్షల వరకు వేలం పాట సంతను ఓ కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. అయితే గత ఏడాది కన్నా తక్కువ ఆదాయం వేలంపాట రూపంలో దక్కిందని పంచాయతీ అధికారులు వారం రోజుల తర్వాత రెండోసారి వేలం పాట పెట్టారు. ఆ సందర్భంలో వేలం పాటలో పాల్గొనే కాంట్రాక్టర్లు సీక్రెట్ కవర్ లో సంత వేలం విలువ రాసి ప్రత్యేక బాక్సులో వేశారు. దాంతో అత్యధికంగా రూ. 80.13 లక్షల వరకు ఓ కాంట్రాక్టర్ గ్రామ పంచాయతీకి చెల్లిస్తానని రాసినట్టు సమాచారం.రెండోసారి నిర్వహించిన



వేలంపాటలో కూడా 2025-26 సంవత్సరం ఆదాయం కన్నా తక్కువగా రావడంతో పంచాయతీ అధికారులు జిల్లా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పూర్తి నిర్ణయాధికారం వారికే వదిలేసినట్లు తెలిసింది. అయితే కొంతమంది కాంట్రాక్టర్లు అంగడి సరిగ్గా నడుస్తలేదని కారణం చెప్పి కుమ్మక్కై గ్రామ పంచాయతీకి వచ్చే ఆదాయానికి కష్టం కలిగించేలా కుట్రకు తెరలేపారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కుట్రలో కొంతమంది గ్రామపంచాయితీ సభ్యుల పాత్ర కూడా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.కాంట్రాక్టర్లకు సహకరిస్తున్న కొంతమంది సభ్యులకు ఇప్పటికే కొంత సొమ్ము ముట్టజెప్పినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు గ్రామ పంచాయతీకి ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# స్కిల్ యూనివర్శిటీ ఉపకేంద్రాలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఉద్యోగ అవకాశాలు కల్పించేలా స్కిల్ యూనివర్శిటీ ఏర్పాటు చేశామని, 33 జిల్లాల్లో స్కిల్ యూనివర్శిటీ ఉపకేంద్రాలను ఏర్పాటు చేస్తామని, అప్పుడే యువతకు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయిఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి కేవలం నగరాలకే పరిమితం కాకూడదని, ప్రతి జిల్లాకు పరిశ్రమలు రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఎక్కడైతే నైపుణ్యం కలిగిన యువత అందుబాటులో ఉంటారో, అక్కడ ఆయా రంగాలకు సంబంధించిన పరిశ్రమలను నెలకొల్పేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. శాసనమండలిలో సభ్యులు మధుసూధన్ చారి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. వికారాబాద్ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. గత రెండేళ్లలో ఈ జిల్లాలో 133 యూనిట్లకు టీజీ-పాస్ అనుమతులు ఇచ్చామని, దీంతో రూ.112 కోట్ల పెట్టుబడులు రావడమే కాకుండా 1,518 మందికి ఉపాధి లభించనుందని చెప్పారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా చూస్తే, గత రెండేళ్లలో 5,067 యూనిట్లకు అనుమతులు మంజూరు చేశామన్నారు.వీటి ద్వారా వివిధ దశల్లో 1,82,121 మందికి ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయని మంత్రి వివరించారు. రాష్ట్రం నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయన్న వార్తలను మంత్రి కొట్టిపారేశారు. అలాంటి అధికారిక సమాచారం ఏదీ లేదన్నారు. అయితే, ఐటీ, సెమీ కండక్టర్ల రంగాల్లో కేంద్ర ప్రభుత్వం కొన్ని రాష్ట్రాల పట్ల ప్రత్యేక ఆసక్తి చూపిస్తోందని విమర్శించారు. మన దగ్గర అద్భుతమైన ఎకో సిస్టమ్ ఉన్నప్పటికీ, కేంద్రం తీసుకునే కొన్ని నిర్ణయాల వల్ల రాష్ట్రానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన మంచి పాలసీలను కొనసాగిస్తామని, వరంగల్ జిల్లాలోని పీఎం మిత్రా టెక్స్‌టైల్ పార్క్ పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. కిటెక్స్, యంగ్ వన్, గణేశా వంటి సంస్థలకు ఇప్పటికే అన్ని రకాల అనుమతులు మంజూరు చేశామని, తెలంగాణ ప్రగతే తమ లక్ష్యమని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. 33 జిల్లాల్లో స్కిల్ యూనివర్శిటీ ఉపకేంద్రాలను ఏర్పాటు చేస్తాం. అప్పుడే యువతకు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. చిన్న తరహా పరిశ్రమలకు ప్రోత్సహకాలు అందిస్తామన్నారు. హిల్ట్ పాలసీ గైడ్లెన్స్ అంశాలను కార్మిక సంఘాలతో, యాజమాన్యాలతో చర్చిస్తాం. కార్మికులకు సంబంధించి ఉద్యోగ భద్రత కల్పిస్తూ కార్యాచరణ రూపొందించామన్నారు.

**ఐటీ పార్కుల వల్ల 10 శాతం ఉపయోగం లేదు..**

స్కిల్ యూనివర్శిటీకి సంబంధించిన విషయాలను మంత్రి ప్రస్తావించిన సమయంలో ఐటీ పార్కుల వల్ల 10 శాతం ఉపయోగం లేదని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మంత్రికి సూచించారు. ఐటీ పార్కులకు సంబంధించి మంత్రి మాట్లాడుతూ నిజమామాబాద్, ఆదిలాబాద్ లో అతి త్వరలో ప్రారంభిస్తాం. ఖమ్మంలో ఐటీ పార్కు విజయవంతంగా నడుస్తోందన్నారు. ఐటీ పార్కులకు సంబంధించి ఇన్సెంటివ్స్ ఇచ్చే ప్రతిపాదనను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు.

# అసెంబ్లీ ముట్టడికి బీజేపీ యత్నం..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఇవాళ బీజేపీ మరోసారి అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ క్రమంలో నగరంలో బషీర్‌బాగ్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ నేతృత్వంలో పెద్ద సంఖ్యలో దివ్యాంగులు ఈ నిరసనలో పాల్గొన్నారు. బషీర్‌బాగ్ ఫ్లైఓవర్ నుంచి అసెంబ్లీ వైపు కాలినడకన బయలుదేరారు.ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన పెన్షన్ పెంపు, ఇతర సంక్షేమ పథకాల హామీలను ప్రభుత్వం విస్మరించిందని పాయల్ శంకర్ ధ్వజమెత్తారు. తక్షణమే అర్హులైన వారందరికీ పెంచిన పెన్షన్లు అందజేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ పరిసరాల్లో భారీగా మోహరించిన పోలీసులు నిరసనకారులను బషీర్‌బాగ్ వద్దే అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీజేపీ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. నిరసనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని సమీప పోలీస్ స్టేషన్లకు తరలించారు. దివ్యాంగుల హక్కుల కోసం తమ పోరాటం ఆగదని, ప్రభుత్వం దిగివచ్చేవరకు ఆందోళనలు కొనసాగిస్తామని పాయల్ శంకర్ వార్నింగ్ ఇచ్చారు.

# రెచ్చిపోతున్న మట్టి మాఫియా!

- ఇసుక డంప్‌లను తలపిస్తున్న మొరం నిల్వలు
- ఏదులాపురంలో ప్రభుత్వ భూములే టార్గెట్?
- అర్ధరాత్రి వేళ.. వందలాది టిప్పర్లతో అక్రమ రవాణా
- ఒక్కో ట్రక్కు రూ.5 వేలకు పైనే..
- మామూళ్ల మత్తులో మైనింగ్ అధికారులు?



**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** జిల్లాలోని ఏదులాపురం మున్సి పాలిటీ పరిధిలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. అక్రమార్కులు ఇసుక డంప్‌ల మాదిరిగానే పదుల సంఖ్యలో మట్టిని కూడా డంప్ చేస్తున్నారు. ప్రభుత్వ భూములే టార్గెట్‌గా పెట్టుకొని.. ఎలాంటి అనుమతులు లేకుండా ఆ భూ ముల్లోని మట్టిని అర్ధరాత్రి వేళ వందల టిప్పర్లలో తరలిస్తూ.. ఖాళీ ప్రదే శాలు, వెంచర్‌లలో డంప్ చేస్తున్నారు. ఈ మట్టిని పగటిపూట వెంచర్లకు తరలిస్తూ అతి తక్కువ కాలంలో రూ.లక్షలు గడిస్తున్నారు. ఇంత జరుగుతు న్నా.. సంబంధిత మైనింగ్ శాఖాధికారులు మామూళ్ల మత్తులో మునిగి తేలు తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

**ప్రభుత్వ భూములే లక్ష్యంగా..**

మట్టి మాఫియాకు ప్రభుత్వ భూములే టార్గెట్‌గా మారాయి. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ముత్తగూడెం, వెంకటగిరి, మద్దులపల్లి, తెల్దారు పల్లి, గొల్లగూడెం, రూరల్ మండలంలోని మంగళగూడెం, కస్నాతండా, వాల్యాతండా, ఆరెకోడు, వెంకటాయపాలెం తదితర గ్రామాల్లో ఈ మట్టి దందా జోరుగా సాగుతోంది. అర్ధరాత్రి సమయంలో వందల టిప్పర్లు, డంపర్లతో.. అక్రమార్కులు వేలాది ట్రిప్పుల మట్టి తోలకాలు సాగిస్తున్నారు. నిత్యం రాత్రి వేళల్లో పలు గ్రామాల మీదు గా లారీల్లో మట్టి తరలిస్తుండడంతో.. ఆయా గ్రామాల ప్రజలు కంటిమీద కునుకు లేకుండా భయంనీడన కాలం వెల్లదీస్తున్నారు. ఈ మాఫియా కం టికి కినిపించిన గుట్టలు, భూములను తెల్లవారేసరికి పిండిపారేస్తున్నారు.

**మట్టి మాఫియా కొత్త దందా**

ప్రభుత్వ భూములు, గుట్టలే టార్గెట్‌గా పెట్టుకున్న మట్టి మాఫియా.. ప్ర స్తుతం సరికొత్త దందాకు తెర లేపింది. గతంలో ఎప్పటికప్పుడు గుట్టలనుంచి తవ్వి కావాల్సిన వారికి విక్రయించేవారు. ఇప్పుడు అక్రమార్కులు 'రూటు' మార్చారు. అర్ధరాత్రి సమయంలో వందల టిప్పర్లు, డంపర్లతో ముత్తగూడెం పరిధిలోని వెంచర్లలో, రాజీవ్‌స్వగృహ ప్రాంతంలోని ఖాళీ ప్రదేశంలో వేలాది ట్రిప్పుల మట్టిని డంప్ చేస్తున్నారు. ఈ మట్టి డంప్‌లు చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఒక్కో డంప్‌లో వేలాది ట్రిప్పుల మట్టిని దాచిపెడుతున్నారు. ఈ డంప్‌లే చిన్నపాటి గుట్టలను తలపిస్తున్నాయి. ఈ మట్టిని పగటిపూట ఖమ్మం, వరంగల్ క్రాస్‌రోడ్డుతో పాటు ఇతర ప్రాంతాల్లోని వెంచర్లు, ఇళ్లకు తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్పుకు రూ.5 వేలు వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. సంబంధింత మైనింగ్ శాఖాధికారులు ఇటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. మాఫి యా ఇచ్చే ముడుపులకు కక్కుర్తిపడి అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాఫియాతో ఎలాంటి ఒప్పందం లేకుంటే.. మైనింగ్ అధికారులు ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మైనింగ్ శాఖాధికారులు.. మట్టి మాఫియాపై దృష్టి సారించి, అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**మట్టి తవ్వడం నేరం: మైనింగ్ ఏడీ సాయినాథ్**

ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా మట్టి తీయడం నేరం. అలాంటి మట్టిని డంపింగ్ చేయడం తప్పు. ప్రస్తుతం ఈ మట్టి తోలకాలు, డంపింగ్ వ్యవహారాలు దృష్టికి రాలేదు. వెంటనే వాటిని పరిశీలించి చట్టప రంగా చర్యలు తీసుకుంటాం.

# మొయినాబాద్ డ్రగ్స్ కేసు

## సిట్ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీఆర్‌ఎస్ తాండూరు మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో వెలుగుచూసిన డ్రగ్స్ పార్టీ వ్యవహారంపై శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ కేంద్రంగా సిట్ విచారణ ముమ్మరంగా సాగుతోంది. నిందితుల వాంగ్మూలాలు ఈ కేసును మరో మలుపు తిప్పాయి. ముగ్గురు నిందితులను విడివిడిగా విచారిస్తున్న సిట్ బృందం పలు సంచలన విషయాలను రాబట్టింది. ప్రధాన నిందితుడు రోహిత్ రెడ్డి గత ఏడాది కాలంగా క్రమం తప్పకుండా డ్రగ్స్ తీసుకుంటున్నట్లు సిట్ అధికారులు గుర్తించారు.

**తప్పుదోవ పట్టించిన కౌశిక్ రవి..**

ఈ కేసులో డ్రగ్స్ సరఫరా చేసిన అభిషేక్ సింగ్ అత్యంత కీలకంగా మారాడు. రోహిత్ రెడ్డి ఆదేశాల మేరకు అతని డ్రైవర్ సిలివేరి శరత్, అవుటర్ రింగ్ రోడ్ వద్ద అభిషేక్ నుంచి డ్రగ్స్ సేకరించినట్లు సిట్ విచారణలో తేలింది. నిందితుల్లో ఒకరైన కౌశిక్ రవి, డ్రగ్స్ సిమ్లా నుంచి తెచ్చినట్లు పోలీసులకు చెప్పి దర్యాప్తును పక్కదారి పట్టించే ప్రయత్నం చేశాడు. అయితే, సిట్ తనదైన శైలిలో విచారించడంతో అసలు విషయం బయటపడింది.

**మిస్టరీగా మారిన పెడ్లర్ అభిషేక్ సింగ్ పరారీ**

డ్రగ్స్ పార్టీ వ్యవహారం బయటకు రాగానే పెడ్లర్ అభిషేక్ సింగ్ అదృశ్యమయ్యాడు. ఈ నెల 16 నుంచి తన కుమారుడు కనిపించడం లేదని అభిషేక్ తండ్రి రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం అభిషేక్ పరారీలో ఉన్నాడని, అతనిని పట్టుకుంటే ఈ డ్రగ్స్ నెట్‌వర్క్‌లో ఉన్న మరికొంతమంది ప్రముఖుల పేర్లు బయటపడే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

**సిట్ తదుపరి చర్యలు**

నిందితులను ఘటనా స్థలానికి తీసుకెళ్లి సీన్ రీ–కన్స్ట్రక్షన్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. నిందితుల మొబైల్ ఫోన్లలోని కాల్ డేటా, వాట్సాప్ చాట్‌లను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. రోహిత్ రెడ్డి రక్త నమూనాలను సేకరించి, డ్రగ్స్ తీసుకున్న సమయాన్ని, రకాన్ని శాస్త్రీయంగా నిర్ధారించనున్నారు. ఈ కేసులో సెలబ్రిటీలు లేదా రాజకీయ ప్రముఖుల ప్రమే–యం ఉందా అనే కోణంలో కూడా సిట్ ఆరా తీస్తోంది. అభిషేక్ సింగ్ దొరికితే ఈ కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉంది.



# విద్యుత్ షాక్ తో రైతు మృతి

**టేక్మాల్,ఫ్లాష్ ఇండియా :** వ్యవసాయ క్షేత్రంలోని బోరు స్టార్టర్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ రైతు విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన ఘటన టేక్మాల్ మండలంలోని సాబాతండాలో చోటుచేసుకుంది. ఎస్సై అరవింద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన రామావత్ మోత్య 55 మంగళవారం తన వ్యవసాయ క్షేత్రంలోని బోరు వద్ద పంటకు నీరు కోసం మోటర్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై అరవింద్ కుమార్ తెలిపారు.

# పక్కాగా ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు రావద్దు
## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రబీ సీజన్ కి సంబంధించి ధాన్యం కొనుగోలు నిర్వహణ ప్రక్రియ సజావుగా జరగాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై వ్యవసాయ, మార్కెట్, రవాణా, గ్రామీణాభివృద్ధి, కో–ఆపరేటివ్ , తదితర శాఖల అధికారులతో మంగళవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మినీ కాన్ఫరెన్స్ హాల్లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాలకు వచ్చే ధాన్యం కొనుగోలు పక్కాగా జరగాలన్నారు. అన్ని కేంద్రాల్లో ప్రభుత్వ నియమనిబంధనలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. కేంద్రాలకు ఏ రోజు వచ్చే ధాన్యం అదే రోజు కొనుగోలు జరిగి…ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు వారి ధాన్యాన్ని ఏ రోజు తీసుకురావాలో వ్యవసాయ అధికారులు తప్పకుండా టోకెన్ ల ద్వారా తెలియజేయాలన్నారు. అలాగే టార్పాలిన్లు, ధాన్యాన్ని తూర్పార పట్టే యంత్రాలు, గన్నీ సంచులు, వెయింగ్ మెషీన్ లు, తదితరాలు పరికరాలు అన్నీ కొనుగోలు కేంద్రాలలో సరిపడా అందుబాటులో ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలన బృందాల చే ఆకస్మిక తనిఖీ లు చేపించి కొనుగోలు ప్రక్రియ ను పర్యవేక్షణ చేయాలన్నారు ఈ సమావేశంలో డిఆర్డిఓ వసంత, జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనీ, డీఎం సీఎస్ హతీరాం, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం

## ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహణ






**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**

ప్రపంచ క్షయవ్యాధి (TB) దినోత్సవాన్ని పురస్కరించుకొని జనగామ జిల్లాలో నెహ్రూ పార్క్ నుండి బస్ స్టాండ్ ఎక్స్ రోడ్స్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. ఈ ర్యాలీని జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. కె. మల్లికార్జునరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్మూలనలో ప్రజల అవగాహన అత్యంత ముఖ్యమని, ప్రారంభ ద శలోనే గుర్తింపు మరియు పూర్తి చికిత్స తీసుకోవడం ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న ఉచిత నిర్ధారణ మరియు చికిత్స సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో క్షయవ్యాధి పట్ల చైతన్యం పెంపొందించి, సమయానికి వైద్య సేవలు పొందేలా ప్రోత్సహించడం లక్ష్యంగా నిర్వహించబడింది. ఈ ర్యాలీలో డా అశోక్ కుమార్, టీబీ ప్రోగ్రాం ఆఫసర్, డా శ్రీ హర్ష, డా శ్యామ్ కుమార్, డా కమల్ హస్సన్, డెమో ప్రభాకర్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, విద్యార్థులు మరియు ప్రజలు పాల్గొని క్షయవ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు మరియు చికిత్సపై అవగాహన కల్పించారు.

సం/–జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి జనగామ జిల్లా



# రైతులు ఆందోళన చెందొద్దు

**గంగాధర,ఫ్లాష్ ఇండియా :** చొప్పదండి నియోజకవర్గంలోని రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని, చివరి మడి వరకు నీటిని అందించి పంటలు ఎండిపోకుండా కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా ఇచ్చారు. రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ఈఎన్సీ రమేష్ బాబును ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మర్యాదపూర్వకంగా కలిసి చొప్పదండి నియోజకవర్గానికి సంబంధించిన సాగునీటి సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా గాయత్రి పంప్ హౌస్ నుంచి వరద కాలువకు తక్షణం నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వరద కాలువకు నీటిని విడుదల చేయాలని ఈఎన్సీ రమేష్ బాబుకు వెంటనే ఆదేశాలు జారీ చేశారు. మంత్రి ఆదేశాల మేరకు ఎల్లుండి గాయత్రి పంప్ హౌస్ నుంచి వరద కాలువకు నీటిని విడుదల చేసే ప్రక్రియ ప్రారంభమవుతుందని అధికార యంత్రాంగం తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. సాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఇది ఎంతో ఉపశమనాన్ని కలిగించే నిర్ణయమని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతాంగ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి ఎకరానికి సాగునీరు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తక్షణ చర్యలు తీసుకున్న మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి ఎమ్మెల్యే సత్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# హైదరాబాద్‌లో రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం

అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరు –ఏప్రిల్ మొదటివారంలో తిరిగి సమావేశం కానున్న కమిటీ



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

హైదరాబాద్‌లోని ఎఫ్‌డీసీ బోర్డు రూమ్‌లో ఈ రోజు రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఎస్‌ఎంఏసీ -- స్టేట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ) సమావేశం జరిగింది. ప్రెస్ అకాడమీ, ఎస్‌ఎంఏసీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార--పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్, ఎస్‌ఎంఏసీ కో–చైర్‌పర్సన్ సీహెచ్ ప్రియాంకతో కలిసి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. అక్రిడిటేషన్ కోసం జర్నలిస్టులు సమర్పించిన దరఖాస్తులను కమిటీ సభ్యులు సమగ్రంగా పరిశీలించారు. జర్నలిస్టుల నుంచి అందిన ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు కార్డు మంజూర–ంలో ఎలాంటి లోపం ఉండదని స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కమిటీ సమావేశాన్ని వచ్చే నెల మొదటివారంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. జిల్లాల వారీగా కలెక్టర్లు పంపే 'జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)' ప్రతిపాదనలను కూడా పరిశీలించి ఆమోదం తెలుపుతుందని వెల్లడించారు. ఈ మేరకు జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్లను కోరారు. సమాచార--పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డి.ఎస్. జగన్ పాటు ఇతర కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

**అచ్చంపేట,ఫ్లాష్ ఇండియా :** నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని లోతట్టు ప్రాంతమైన సలేశ్వరం జాతరకి ఉన్న ప్రత్యేకత గురించి అందరికీ తెలిసిందే. ఈ జాతరకు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు తండోపతండాలుగా తరలివస్తుంటారు. ఈ ఏడాది ఏప్రిల్ 01 నుంచి 03 వరకు సలేశ్వరం జాతర జరుగనుంది. జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తో కలిసి సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ సలేశ్వరం జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారని.. ఇందుకు సహకరించాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ప్రమాదవశాత్తు అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అటవీశాఖ సిబ్బందితో కలిసి పోలీస్ శాఖ బందోబస్తు నిర్వహించాలని, రాత్రి సమయంలో పాదయాత్ర చేసే భక్తులకు మధ్య మధ్యలో సోలార్ లైట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నాగర్ కర్నూలు, కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట డిపోల నుంచి భక్తుల సౌకర్యార్థం బస్సులను ఏర్పాటు చేయాలని నాగర్ కర్నూలు డీఎం ను కలెక్టర్ ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ తరపున ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసి వైద్యసిబ్బందిని అంబులెన్స్ లో పర్యవేక్షణ జరిపేలా ఏర్పాటు చేయాలన్నారు. కింద గుండం దగ్గర వైద్య సిబ్బంది అన్ని రకాల సదుపాయాలతో సంసిద్ధంగా ఉండాలని డీఎంహెచ్ఓ ను ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని తెలిపారు. అధిక సంఖ్యలో వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకొని.. వేసవి కాలంలో తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆర్ డబ్ల్యూయస్ ఈఈని కలెక్టర్ ఆదేశించారు. సలేశ్వరం జాతరకు వచ్చే వాహనాలు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలని, వాహనాల అనుమతి తదితర అంశాలను పోలీస్, ఫారెస్ట్ అధికారులు సమన్వయంతో పని చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జాతరకు వచ్చే భక్తులకు ఏర్పాటు చేసే అన్నదాన కార్యక్రమాల్లో భాగంగా అడవిలో ప్లాస్టిక్ వినియోగించకుండా చూడాలని, రెండు రోజుల్లో అన్ని శాఖల అధికారులతో కలిసి క్షేత్ర–స్థాయిలో తాను కూడా పర్యటించి, పకడ్బందీ ఏర్పాట్లు జరిగేలా చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

**సలేశ్వరం జాతరకు వారు రావద్దు**

సలేశ్వరం జాతరకు గర్భిణీ మహిళలు, శ్వాసకు సంబంధించిన సమస్యలు ఉన్నవారు సలేశ్వరం జాతరకు రాకుంటే మంచిదని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖల



అధికారులు సమన్వయంతో పనిచేయాలని, టాపిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అధికారులు కమిటీ సభ్యులు చెంచు సంఘాల నాయకులు పోలీస్ శాఖకు సహకారాలు అందించాలని, సలేశ్వరం జాతరను అత్యంత పకడ్బందీగా సజావుగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ సంసిద్ధంగా ఉందని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి, అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ డబ్ల్యూఎస్ డీఈ హేమలత, వివిధ శాఖల అధికారులు, సలేశ్వరం ఆలయ కమిటీ సభ్యులు, చెంచు సంఘాల నాయకులు లింగస్వామి, గురువయ్య, ఈర్లపెంట సర్పంచ్ శివమ్మ పాల్గొన్నారు.


# హాల్దీ వాగు బ్యాక్ వాటర్లలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**వెల్దుర్తి,ఫ్లాష్ ఇండియా :** మాసాయిపేట మండలంలోని గోపాలకృష్ణపురం వద్ద హాల్దీ వాగు బ్యాక్ వాటర్లలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి వయస్సు సుమారు 35--40 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పోలీసులు తెలిపారు. అతడు బ్లూ–బ్లాక్ లైన్ షర్ట్, బ్లాక్ కలర్ షార్ట్ ధరించి ఉన్నట్లు గుర్తించారు. చేపల వేటకు వచ్చిన స్థానిక వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందిన ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్దుర్తి ఎస్సై రాజు తెలిపారు. మృతుడి గురించి ఏదైనా సమాచారం తెలిసిన వారు వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

# రింకు సింగ్‌కు కీలక పదవి..




భారత క్రికెటర్ రింకూ సింగ్ మరో కొత్త పాత్రను చేపట్టనున్నాడు. రింకును ప్రాంతీయ క్రీడా అధికారిగా ఈరోజు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నియమించబోతోంది. ఈ పరిపాలనా బాధ్యతల ద్వారా యూపీలో క్రీడల అభివృద్ధికి దోహదపడనున్నాడు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈరోజు లక్నోలో జరిగే ఓ కార్యక్రమంలో రింకుకు ఈ కొత్త బాధ్యతను అప్పగించనున్నారు. భారత్ తరఫున అద్భుత ప్రదర్శనలు చేసినందుకు, ముఖ్యంగా టీమిండియా టీ20 వరల్డ్ కప్ 2026 గెలవడంలో భాగస్వామి అయినందుకు యూపీ ప్రభుత్వం ఈ బాధ్యతను ఇస్తోంది.వాస్తవానికి 2025 జనవరిలో క్రీడా కోటా కింద రింకు సింగ్‌ను ప్రాథమిక విద్యా శాఖ బీఎస్ఏగా నియమించాలని యూపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2022 ప్రత్యేక నిబంధనల కింద ఆయన ఎంపికను ప్రతిపాదించి.. అవసరమైన పత్రాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయమని సూచించారు. అయితే ఆ సమయంలో రింకు విద్యా అర్హతలకు సంబంధించి ఓ వివాదం తలెత్తడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పుడు ప్రభుత్వం రింకుకు క్రీడా శాఖలో ఓ కొత్త పాత్రను కేటాయించి బాధ్యతను అప్పగించాలని నిర్ణయించింది. ప్రస్తుతం రింకు ఐపీఎల్ 2026 కోసం సిద్ధమవుతున్నాడు.క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా యూపీ ప్రభుత్వం భారీ ప్రోత్సాహక ప్యాకేజీని ప్రకటించింది. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లకు ప్రభుత్వ ఉద్యోగాలు, నగదు బహుమతులు, ప్రతిష్టాత్మక అవార్డులు అందజేయనున్నారు. ఈ క్రమంలో మొత్తం ఆరుగురు అంతర్జాతీయ మెడల్ విజేతలకు ఉద్యోగాలు ఇవ్వనున్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత హాకీ ఆటగాడు రాజ్‌కుమార్ పాల్‌ను డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా నియమించనున్నారు. అదే విధంగా పారాలింపిక్స్ హైజంప్ గోల్డ్ మెడలిస్ట్ ప్రవీణ్ కుమార్‌కు కూడా డీఎస్పీ పదవి ఇవ్వనున్నారు. జావెలిన్ త్రోలో రజత పతకం సాధించిన అజిత్ సింగ్, 200 మీటర్ల బ్రాంజ్ మెడలిస్ట్ సిమ్రన్‌లకు జిల్లా పంచాయతీ రాజ్ అధికారి పదవులు ఇవ్వనున్నారు.అలాగే పారాలింపిక్స్‌లో 100మీ, 200మీ ఈవెంట్లలో కాంస్య పతకాలు సాధించిన ప్రీతిపాల్‌కు బ్లాక్ డెవలప్మెంట్ ఆఫీసర్ (బీడీవో)గా నియామకం జరగనుంది. మొత్తం ఆరుగురు ఆటగాళ్లకు నేటి సన్మాన కార్యక్రమంలో నియామక పత్రాలు అందజేయనున్నారు. 2024–25 సంవత్సరానికి గాను లక్ష్మణ్ అవార్డు, రాణి లక్ష్మీబాయి అవార్డులతో తొమ్మిది మంది క్రీడాకారులను సత్కరించనున్నారు. ఈ అవార్డుల కింద ఒక్కొక్కరికి రూ.3.11 లక్షల నగదు బహుమతి, కాంస్య ప్రతిమ ఇవ్వనున్నారు. అదనంగా 14 మంది క్రీడాకారులకు రూ.1.64 కోట్ల నగదు బహుమతులు, 19 మందికి ఏకలవ్య క్రీడా నిధి కింద రూ.8.75 లక్షల ఆర్థిక సహాయం అందించనున్నారు. ఈ నిర్ణయాలతో యూపీ ప్రభుత్వం క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందిస్తూ.. క్రీడా రంగ అభివృద్ధికి కీలక అడుగులు వేస్తోంది.



## టీమ్‌లోకి ఆ స్టార్ బౌలర్ వచ్చేశాడోచ్..!

ఐపీఎల్ 2026కు ఇంకా నాలుగు రోజులే మిగిలి ఉంది. మార్చి 28న సన్‌రైజర్స్ హైదరాబాద్ , డిఫెండింగ్ ఛాంపియన్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య తొలి పోరు జగరనుంది. ఈ సందర్భంగా ఎస్ఆర్‌హెచ్‌కి గుడ్‌న్యూస్ వచ్చింది. తొలి మ్యాచ్‌కు ముందే శ్రీలంకకు చెందిన స్టార్ ఫాస్ట్ బౌలర్ ఎషాన్ మలింగ అంశంలో క్లారిటీ వచ్చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో మలింగ గాయపడిన విషయం తెలిసిందే. ఆ గాయం కారణంగా టీ20 వరల్డ్ కప్‌కు దూరమయ్యాడు. గాయం ఇంకా మానలేదని.. ఐపీఎల్‌లోనూ ఆడేందుకు అవకాశం లేదనే వార్తలు చెక్కర్లు కొట్టాయి. అయితే.. ఎషాన్ మలింగ తిరిగి ఫిట్‌నెస్ సాధించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో చేరనున్నాడు. మరికొన్ని రోజుల్లోనే టీమ్‌లోకి వస్తాడని చెబుతున్నారు. ఫిట్‌నెస్ పరీక్షను విజయవంతంగా పూర్తి చేసిన మలింగకు ఐపీఎల్‌లో పాల్గొనేందుకు శ్రీలంక క్రికెట్ బోర్డు నుంచి 'నో అబ్జెక్షన్ సర్టిఫికేట్' సైతం లభించింది. ఈ స్టార్ బౌలర్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. యార్కర్లతో బ్యాటర్లను ఇబ్బంది పెడుతుంటాడు. ఇదిలా ఉండగా.. ఎస్ఆర్‌హెచ్ టీమ్‌లో బ్యాటింగ్ లైనప్ బాగానే ఉన్నప్పటికీ.. బౌలింగ్‌లో మాత్రం జట్టు పేలవంగా ఉంది. ఈ నేపథ్యంలో మలింగ టీమ్‌లోకి ఎంట్రీ ఇవ్వడంతో ఎస్ఆర్‌హెచ్‌కు బలం చేకూరనుంది.






# మ్యాచ్ డే ప్రాక్టీస్ బ్యాన్..

ఐపీఎల్ 2026 మార్చి 28న ప్రారంభం కానుంది. ఐపీఎల్ 2026 సీజన్ ముందు బీసీసీఐ అన్ని 10 ఫ్రాంచైజీలకు కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ఇవి ప్రధానంగా ప్రాక్టీస్ సెషన్లు, పిచ్ సంరక్షణ, ప్రాక్టీస్ మ్యాచ్‌లు, మ్యాచ్ డే నియమాలపై దృష్టి సారించాయి. తన కొత్త ఉత్తర్వులో, జట్లు ఏమి చేయవచ్చు, ఏమి చేయకూడదు అనే దానిపై బీసీసీఐ పలు విషయాలను స్పష్టం చేసింది. ఇకపై, ప్రతి జట్టులోని ఆటగాళ్లు కేవలం జట్టు బస్సులో మాత్రమే ప్రయాణించాలి. తమ కుటుంబాలతో కలిసి ప్రయాణించడానికి అనుమతిలేదు. అంతేకాకుండా, మ్యాచ్ జరిగే రోజులలో ఎలాంటి ప్రాక్టీస్ సెషన్‌లకు అనుమతి ఉండదు.క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం, వాంఖడే స్టేడియంలో ప్రధాన మైదానానికి ఇరువైపులా జట్లకు రెండు ప్రాక్టీస్ వికెట్లను కేటాయించేందుకు బీసీసీఐ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రత్యర్థి జట్టు ప్రాక్టీస్ వికెట్‌ను ఏ జట్టు కూడా ఉపయోగించుకోవడానికి అనుమతి లేదు. జట్టు మేనేజర్లకు బీసీసీఐ అందించిన మార్గదర్శకాలను ఇప్పుడు చూద్దాం.

**ఐపీఎల్ 2026 కోసం బీసీసీఐ కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది**

ఓపెన్ నెట్ అనుమతిలేదు.ఒక జట్టు ప్రాక్టీస్ సెషన్ ముందుగానే ముగిస్తే, మరో జట్టు ఆ పిచ్‌ను ప్రాక్టీస్ కోసం ఉపయోగించుకోవడానికి అనుమతి ఉండదు.మ్యాచ్ జరిగే రోజున ప్రధాన ప్రాంగణంలో ఫిట్‌నెస్ పరీక్ష ఉండదు.ప్రాక్టీస్ రోజులలో కూడా, ఆటగాళ్లు తమ టీమ్ బస్సులలోనే స్టేడియానికి ప్రయాణించాలి. జట్లు రెండు వేర్వేరు బృందాలుగా రావచ్చు.ఆటగాళ్లు తమ సమీప కుటుంబ సభ్యుల నుండి విడిగా జట్టుతో ప్రయాణించాలి. ఒకవేళ ఆటగాడికి కుటుంబ సభ్యులు, స్నేహితులు ఉంటే, వారు వేరే వాహనంలో ప్రయాణించి, హాస్పిటాలిటీ ఏరియా నుండి జట్టు ప్రాక్టీస్‌ను వీక్షించవచ్చు.మ్యాచ్ జరిగే రోజులలో ప్రాక్టీస్‌కు అనుమతి ఉండదు.

**మ్యాచ్ రోజు నియమాలు**

ప్లేయర్, మ్యాచ్ అధికారుల ప్రాంతం గుర్తింపు పొందిన సిబ్బంది మ్యాచ్ రోజున వారి గుర్తింపు పత్రాన్ని తప్పనిసరిగా తీసుకురావాలి. మొదటిసారి అలా చేయడంలో విఫలమైతే హెచ్చరిక జారీ చేస్తారు. రెండవసారి అలా చేయడంలో విఫలమైతే జరిమానా విధించనున్నారు.హిట్టింగ్ నెట్ ఏర్పాటు చేసినప్పటికీ, ఆటగాళ్లు LED నెట్‌ను కొట్టడానికి అనుమతి లేదు.ఆటగాళ్లు, సహాయక సిబ్బంది LED బోర్డుల ముందు కూర్చోకూడదు.

టవల్స్, వాటర్ బాటిళ్లను తీసుకువచ్చే ప్రత్యామ్నాయ ఆటగాళ్లు కూర్చోవడానికి, స్పాన్సర్ చేసే జట్టు ఆట మైదానంలో ప్రదేశాలను గుర్తించి ఉంచుతుంది.ప్రసారంలో కనిపించడం కోసం, ఆటగాళ్లు కనీసం మొదటి రెండు ఓవర్ల పాటు నారింజ, ఊదా రంగు టోపీలను ధరించాల్సి ఉంటుంది.మ్యాచ్ అనంతర బహుమతి ప్రదానోత్సవంలో వదులుగా ఉండే లేదా చేతులు లేని జెర్సీలకు అనుమతి లేదు. అలా చేస్తే, మొదటిసారి హెచ్చరిక, రెండవసారి జరిమానా విధిస్తారు.ఐపీఎల్ 2025 మాదిరిగానే, మ్యాచ్ జరిగే రోజుల్లో టీమ్ డాక్టర్‌తో సహా 12 మంది గుర్తింపు పొందిన సహాయక సిబ్బందిని మాత్రమే అనుమతిస్తారు.

## మరో 4 రోజుల్లో ఐపీఎల్ 2026 ఆరంభం..



ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందు ముంబై ఇండియన్స్ (ఎంఐ) జట్టుకు భారీ షాక్ తగిలేలా ఉంది. టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు గాయమైనట్లు తెలుస్తోంది. తాజాగా బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో బుమ్రా వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు సమాచారం. అయితే ఇది రెగ్యులర్ చెకప్‌నా? లేదా ఏదైనా గాయమైందా? అన్న దానిపై ఇంకా స్పష్టత లేదు. ఐపీఎల్ ఆరంభానికి ఇంకా నాలుగు రోజులే ఉండడంతో.. బుమ్రా ఇంకా జట్టుతో చేరకపోవడంతో ముంబై ఇండియన్స్ అభిమానుల్లో ఆందోళన నెలకొంది.జస్ప్రీత్ బుమ్రా కొన్నేళ్లుగా వెన్ను నొప్పితో బాధపడుతున్న విషయం తెలిసిందే. గతేడాది కూడా వెన్ను నొప్పి కారణంగా తీవ్రంగా ఇబ్బందిపడ్డాడు. అయితే కోలుకుని వచ్చిన బుమ్రా.. టీ20 ప్రపంచ కప్ 2026లో మెరిశాడు. కీలక సమయాల్లో కట్టుదిట్టమైన బౌలింగ్ చేసి పరుగులను కట్టడి చేశాడు. 8 మ్యాచ్‌లలో 14 వికెట్లతో టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. అహ్మదాబాద్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్‌లో 4/15 గణాంకాలతో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును అందుకున్నాడు.ప్రస్తుతం జస్ప్రీత్ బుమ్రా కర్ణాటకలోని బీసీసీఐకేంద్రంలో ఉన్నాడు. 2026 ఐపీఎల్ ప్రారంభానికి సమయం దగ్గరపడుతున్న సమయంలో అతను ఇంకా ముంబై ఇండియన్స్ క్యాంప్‌లో చేరకపోవడం అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది. జట్టులో కీలక బౌలర్‌గా ఉన్న బుమ్రా లేకపోతే ముంబై బౌలింగ్ దళం బలహీనపడే అవకాశం ఉంది. ముంబై ఇప్పటికే కెప్టెన్సీ అంశంపై చర్చలతో వార్తల్లో నిలుస్తున్న వేళ.. ఇప్పుడు బుమ్రా పరిస్థితి కూడా మరో సమస్యగా మారనుంది. సరైన ఫిట్‌నెస్ లేకుంటే తొలి మ్యాచ్‌లకు బుమ్రా దూరం కానున్నాడు. త్వరలోనే బీసీసీఐ లేదా ముంబై ఇండియన్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

# బిజినెస్




# జొమాటో బాటలోనే స్విగ్గీ..

ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్ చేసే కస్టమర్లకు షాక్ ఇస్తూ ప్రముఖ డెలివరీ సంస్థలు జొమాటో , స్విగ్గీ తమ ప్లాట్‌ఫారమ్ ఫీజును పెంచాయి. జొమాటో తన చార్జీలను సవరించిన కొద్ది రోజుల్లోనే స్విగ్గీ కూడా ప్లాట్ ఫారమ్ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రతి ఆర్డర్‌పై కస్టమర్లు చెల్లించే అదనపు భారం ఇప్పుడు మరింత పెరగనుంది.

**కస్టమర్లపై అదనపు భారమే..**


స్విగ్గీ తన ప్లాట్‌ఫారమ్ ఫీజును రూ.14.99 నుంచి ఏకంగా రూ.17.58 (జీఎస్టీతో కలిపి) కి పెంచింది. ఇది దాదాపు 17 శాతం పెరుగుదల కావడం గమనార్హం. ప్లాట్‌ఫారమ్ నిర్వహణ, మెరుగైన సేవలను అందించేందుకే ఈ ఫీజును సవరించినట్లు సంస్థ తన యాప్‌లో కస్టమర్లకు సమాచారం ఇస్తోంది. మరోవైపు జొమాటో కూడా ఒక్కో ఆర్డర్‌పై జీఎస్టీ కాకుండా రూ.12.50 గా ఉన్న ప్లాట్‌ఫారమ్ ఫీజును రూ.14.90 కి పెంచింది. అంటే ఒక్కో ఆర్డర్‌పై సుమారు రూ.2.40 అదనంగా భారం పడనుంది.పన్నులతో కలిపి చూస్తే ఈ రెండు పోటీ సంస్థలు ఇప్పుడు దాదాపు ఒకే విధమైన చార్జీలను వసూలు చేస్తున్నాయి. సాధారణంగా ప్లాట్‌ఫారమ్ ఫీజు అనేది చిన్న మొత్తంగా అనిపించినప్పటికీ, నెలకు పదుల సంఖ్యలో ఆర్డర్లు చేసే కస్టమర్ల బడ్జెట్‌పై ఇది గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. యాప్ సాంకేతికతను మెరుగుపరచడం, నిర్వహణ ఖర్చులు, కార్యకలాపాల వ్యయం పెరగడమే ఈ పెంపునకు కారణమని కంపెనీలు సమర్థించుకుంటున్నాయి.అయితే.. ఈ ఫీజుల పెంపు సమయంలోనే ఫుడ్ డెలివరీ రంగంలోకి కొత్త పోటీదారులు ప్రవేశిస్తున్నారు. రైడ్-హేయింగ్ స్టార్టప్ రాపిడో ఇప్పటికే బెంగళూరులో 'ఓన్లీ' పేరుతో తన సేవలను ప్రారంభించింది. జొమాటో, స్విగ్గీలకు భిన్నంగా రాపిడో కస్టమర్ల నుంచి లేదా రెస్టారెంట్ల నుంచి అదనపు ప్లాట్‌ఫారమ్ ఫీజులు వసూలు చేయబోమని, కేవలం బేసిక్ డెలివరీ చార్జీలు మాత్రమే ఉంటాయని ప్రకటించడం విశేషం. కొత్తగా వస్తున్న ఈ సంస్థల ప్రభావం వల్ల భవిష్యత్తులో జొమాటో, స్విగ్గీలు తమ ధరల వ్యూహాలను మార్చుకుంటాయో లేదో వేచి చూడాలి.

## బంగారం ధరలు భారీగా తగ్గాయి!




బంగారం ధరలు ఈరోజు మళ్లీ తగ్గాయి. వరుసగా గోల్డ్ ధరలు తగ్గుముఖం పడుతుండడంతో కొనుగోలుదారుల్లో జోష్ పెరుగుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం పై రూ. 2,700 తగ్గింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం పై రూ. 2,940 తగ్గింది. కిలో వెండి పై రూ.10000 తగ్గింది. హైదరాబాద్ ఈరోజు 22 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ. 12,865, 24 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ. 14,035 వద్ద ట్రేడ్ అవుతోంది.హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,28,650 వద్ద ట్రేడ్ అవుతోంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,40,350 వద్ద అమ్ముడవుతోంది. విశాఖ పట్నం,విజయవాడలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,28,800 వద్ద అమ్ముడవుతోంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,40,500 వద్దకు చేరింది.బంగారంతో పోటీపడుతూ ధర పెరుగుతున్న వెండి ధరలు కూడా నేడు భారీగా తగ్గాయి. నేడు కిలో వెండి పై రూ. 10,000 తగ్గింది. హైదరాబాద్ లో కిలో వెండి రూ.2,40,000 వద్ద అమ్ముడవుతోంది. ఢిల్లీలో కిలో వెండిపై రూ. 5000 పెరిగి రూ. 2,35,000 వద్ద ట్రేడ్ అవుతోంది.

# భారీ లాభాల్లో ప్రారంభమైన భారత స్టాక్ మార్కెట్లు




నిన్నటి భారీ పతనం తర్వాత ఇవాళ భారతీయ స్టాక్ మార్కెట్లు కొత్త ఉత్సాహంతో ముందుకెళ్తున్నాయి. ఈ ఉదయం మార్కెట్ ప్రారంభం కాగానే సెన్సెక్స్ సూచీ ఏకంగా 1,500 పాయింట్లు పెరగగా, నిఫ్టీ 22,900 మార్కు చేరువలోకి వెళ్లింది.

**మార్కెట్ విజృంభణకు ప్రధాన కారణాలు:**

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్ పై ఐదు రోజులపాటు యుద్ధం నిలిపివేస్తున్నామని ప్రకటించిన నేపథ్యంలో చేకూరిన అంతర్జాతీయ సానుకూలతలు, అమెరికా మార్కెట్ల నుండి అందుతున్న అనుకూల సంకేతాలు, ఆపై.. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం మన మార్కెట్లకు కలిసొచ్చింది. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గడం మన ఆర్థిక వ్యవస్థకు, రూపాయి విలువకు సానుకూలంగా మారింది. సానుకూల రాజకీయ పరిణామాలు ఇన్వెస్టర్లలో ఉత్సాహాన్ని నింపాయి.ఫలితంగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్ వంటి దిగ్గజ బ్యాంకింగ్ షేర్లలో భారీ కొనుగోళ్లు మార్కెట్ సూచీలను పైకి నెట్టాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు మళ్లీ భారత మార్కెట్లో కొనుగోళ్లు ప్రారంభించడం బుల్ రన్‌కు ప్రధాన కారణమైంది. కేవలం బ్యాంకింగ్ రంగమే కాకుండా, ఐటీ , ఆటోమొబైల్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాలు కూడా భారీ లాభాలను నమోదు చేశాయి. దాదాపు అన్ని రంగాల సూచీలు లాభాల్లోనే ట్రేడ్ అవుతున్నాయి.

# పెరగనున్న కోకా కోలా ధరలు..





భారతదేశంలో కోకా కోలా ఉత్పత్తులను బాటిలింగ్ చేసే ప్రధాన సంస్థ ఎస్ఎల్ఎంజీ బేవరేజెస్ త్వరలో కొన్ని ఉత్పత్తుల ధరలను పెంచే అవకాశం ఉందని సమాచారం. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల కారణంగా ప్యాకేజింగ్ ఖర్చులు పెరుగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకునే పరిస్థితి ఏర్పడింది. కంపెనీ డిప్యూటీ సీఈఓ రాహుల్ కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉత్పత్తి ఖర్చులు ఒత్తిడిలో ఉన్నాయని తెలిపారు. యుద్ధం కొనసాగితే ప్లాస్టిక్ బాటిల్స్, మూతలు, లేబుల్స్, కార్డ్బోర్డ్ బాక్సుల వంటి ప్యాకేజింగ్ వస్తువుల ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. అయితే ధరలు పెంచాలా లేదా అనేది మార్కెట్ పరిస్థితులు.. ఇతర కంపెనీల నిర్ణయాలు, వినియోగదారుల స్పందనపై ఆధారపడి ఉంటుంది.ఇప్పటికే కొన్ని నీటి బాటిల్ కంపెనీలు ధరలను పెంచాయి. కానీ భారతదేశంలో శీతల పానీయాల మార్కెట్ చాలా పోటీగా ఉండటంతో ధరలు పెంచడం అంత సులభం కాదు. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ మళ్లీ కాంపా కూలాను మార్కెట్లోకి తీసుకురావడంతో పోటీ మరింత పెరిగింది. గత 7–8 సంవత్సరాల్లో కంపెనీ పెద్దగా ధరలు పెంచలేదని రాహుల్ కుమార్ తెలిపారు. అయితే ఏప్రిల్‌లో ధరలపై సమీక్ష జరగనుంది. ఇప్పటికీ ఖర్చులు పెరుగుతున్నా, భవిష్యత్తుపై కంపెనీకి నమ్మకం ఉంది. భారత్‌లో శీతల పానీయాల మార్కెట్ రాబోయే సంవత్సరాల్లో వేగంగా పెరుగుతుందని అంచనా. ఈ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని కంపెనీ కొత్తగా నాలుగు ఫ్యాక్టరీలను నిర్మించేందుకు భారీగా పెట్టుబడులు పెట్టాలని యోచిస్తోంది.ఇటీవల కంపెనీ ఆదాయం, లాభాలు కూడా గణనీయంగా పెరిగాయి. రాబోయే సంవత్సరాల్లో ఇంకా ఎక్కువ ఆదాయం సాధించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో వ్యాపారాన్ని విస్తరించి మరింత వృద్ధిని సాధించాలని చూస్తోంది.

## ఆధారాల్లేకుండా ఆరోపణలు వద్దు




ఇటీవల ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పార్ట్‌టైమ్ ఛైర్మన్ అతాను చక్రవర్తి రాజీనామా నేపథ్యంలో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చీఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం జరిగిన సెబీ బోర్డు సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడిన సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే.. స్వతంత్ర డైరెక్టర్లు బాధ్యతాయుతంగా ఉండాలి, వారు చేసే ఏ వ్యాఖ్యలైనా మైనారిటీ వాటాదారుల ప్రయోజనాలపై ప్రభావం చూపుతాయన్నారు. స్వతంత్ర డైరెక్టర్లు అత్యంత కీలమైన స్థానంలో ఉంటారు. కంపెనీని ప్రశ్నించే అధికారం వారికి ఉండవచ్చు. ఇదే సమయంలో మైనారిటీ వాటాదారుల ప్రయోజనాలను కాపాడేలా వారి ధోరణి ఉండాలన్నారు. రికార్డుల్లో సరైన ఆధారాలు లేకుండా ఎవరూ ఎలాంటి నిందారోపణలు చేయకూడదు. స్వతంత్ర డైరెక్టర్లు ఒక నిర్దిష్ట ప్రవర్తనా నియమావళికి కట్టుబడి ఉండాలి. కంపెనీ నిర్వహణ లేదా ప్రతిపాదిత చర్యపై వారికి ఏవైనా సందేహాలు, ఆందోళనలు ఉంటే, వాటిని బోర్డు దృష్టికి తీసుకువచ్చేలా చూడాలి. ఒకవేళ అవి పరిష్కారం కాకపోతే, తమ ఆందోళనలను బోర్డు మీటింగ్ మినిట్స్‌లో ఎంటర్ చేయమని పట్టుబట్టాలని తుహిన్ కాంత పాండే సూచించారు.




# 'దీవాన' మ్యూజికల్ జర్నీ స్టార్ట్...

'శుభం' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న యంగ్ టాలెంటెడ్ యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'దీవాన'. ఈ సినిమా నుంచి ఇప్పటికే వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇప్పుడు తాజాగా మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు మేకర్స్. 'సంగీత ప్రయాణం ఇక్కడే మొదలవుతుంది.. ప్రేమ తొలి స్వరాలు మీ హృదయాన్ని తాకనివ్వండి.. దీవాన నుంచి ఫస్ట్ సింగిల్ 'ఇది ప్రేమ' మార్చి 24న విడుదల కాబోతున్నది' అని ప్రకటించారు.కాగా.. ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్‌పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి రూపొందిస్తున్న 'దీవాన' సినిమాను గీతా ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఇటీవల వాలెంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ చేసిన ఈ సినిమా స్టోరీ పోస్టర్‌కు హ్యూజ్ రెస్పాన్స్ రాగా.. ఇంటెన్స్ లవ్ స్టోరీగా వస్తున్న 'దీవాన' హర్షిత్ రెడ్డి కెరీర్‌లో మరో గుర్తుండిపోయే సినిమా కానుంది.

# ఫస్ట్ టైమ్ అడివి శేష్ డ్యాన్స్



బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్లతో అలరిస్తున్న అడివి శేష్ ఇప్పుడు కొత్త అవతార్‌లో డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇందులో శేష్ తొలిసారిగా మాస్, రగ్గడ్ పాత్రలో కనిపించనున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. షానియల్ డియో ఈ సినిమాతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్‌లో కొనసాగుతున్నాయి. పోస్టర్లు, గ్లింప్స్, టీజర్, అలాగే మొదటి సాంగ్ 'రుబారు'.. అన్నీ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన పొందుతూ సినిమాపై భారీ అంచనాలు నెలకొల్పాయి.తాజాగా మేకర్స్ సెకండ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. డెకాయిట్ సెకండ్ సింగిల్ 'చిచ్చుబుడ్డి' మార్చి 28న రిలీజ్ కానుంది. ఇది అదిరిపోయే డాన్సింగ్ నెంబరు. ఈ పాట కోసం చార్ట్ బస్టర్ ట్యూన్ కంపోజ్ చేశారు. ఈ సాంగ్లో అడివి శేష్ డాన్సింగ్ మూమెంట్స్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా ఉండబోతుందని తెలిపారు. ఈ మూవీని ట్రూ బైలింగ్వల్ ప్రాజెక్ట్‌గా తెలుగు, హిందీ భాషల్లో ఒకేసారి రూపొందిస్తున్నారు. భారీ అంచనాల మధ్య ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదలకు కానుంది.

# వాళ్లిద్దరూ పని రాక్షసులు

కోలీవుడ్ బ్యూటీ శృతిహాసన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈ ముద్దుగుమ్మనటిగానే కాకుండా సింగర్గా కూడా తన కంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. స్టార్ కిడ్ కూతురైనప్ప టికీ, తన ప్రతిభతో స్టార్ హీరోయిన్గా దూసుకెళ్తూ మంచి ఫేమ్ సంపాదించుకుంది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో శృతి ఆసక్తికర విషయాలను ప్రేక్షకులతో పంచుకుంది. 'నెపోకిడ్ వంటి అంశాల గురించి ఎవరైనా మాట్లాడుతుంటే నేనస్సలు ఫైట్ చేయను. ఎందుకంటే నాకు తొలిసారి పాట పాడే చాన్స్ చాలా ఈజీగా వచ్చింది. ఇళయారాజా సంగీత దర్శకత్వంలో నాన్న సినిమాలోనే తొలిసారి సాంగ్ పాడాను. నా వాయిస్ గంభీరంగా ఉంటుందని ఇళయరాజా అంటుండేవారు. ఒకసారి ఆయన ఇంటికి వచ్చినప్పుడు నేను మా పేరెంట్స్పై అరుస్తున్నాను. అప్పుడాయన నీ గొంతులో మంచి రేంజ్ ఉందన్నారు. అయితే ఆయన్ని ఇంప్రెస్ చేసిన నా గొంతు చాలామందికి మాత్రం డామినెంట్గా అనిపించింది. నేను చిన్నప్పుడే పండిత్ మనోహర్ కులకర్ణి, సురేశ్ వాడక్కర్ వంటి మహామహుల వద్ద మ్యూజిక్ నేర్చుకున్న. అలా నాకు మంచి గురువులు లభించారు. ఏం చేయాలి? ఎటువైపు అడుగులు వేయాలి? అనే విషయంలో ఎన్నడూ నాన్న సలహా తీసుకోలేదు. అలాగే రజనీకాంత్ను కూడా సలహా అడ గలేదు. కాకపోతే వాళ్లిద్దరూ చాలా కష్టపడతారు. సినిమా కోసం ప్రా ణాలైనా ఇస్తారు.. ఇద్దరూ పని రా క్షసులు' అంటూ చెప్పుకొచ్చింది.







# పాకిస్థాన్‌లో 'ధురంధర్' సెగ..

'ధురంధర్ 2' సృష్టించిన ప్రకంపనలు అంతా ఇంతా కావు. ఈ సినిమా విడుదల తర్వాత సరిహద్దు అవతల పాకిస్థాన్‌లో ఒక్కసారిగా కలకలం మొదలైంది. ముఖ్యంగా కరాచీలోని అత్యంత రద్దీగా ఉండే లియారి ప్రాంతంలో ఇప్పుడు పరిస్థితి యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోంది. భారతీయ గూఢచారులు తమ మధ్యే ఉన్నారనే భయంతో స్థానికులు, పోలీసులు కలిసి జల్లెడ పడుతుండటం గమనార్హం. సాధారణంగా గ్యాంగ్ వార్లకు, ఫుట్‌బాల్ క్రేజ్‌కు పేరుగాంచిన లియారి ప్రాంతం ఇప్పుడు 'స్పై హంట్'కు వేదికైంది. ధురంధర్ సిరీస్ ప్రభావంతో అక్కడి ప్రజల్లో ఒక రకమైన అభద్రతా భావం పెరిగిపోయింది. ప్రతి వీధిలోనూ, ప్రతి సందులోనూ అనుమానితుల కోసం పోలీసులు తనిఖీలు చేపట్టారు. స్థానిక ప్రజలు కూడా పోలీసులతో చేతులు కలిపి, కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే వారిని ప్రశ్నిస్తూ విచారణ చేపడుతున్నారు.ప్రస్తుతం అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. అయితే, ఆ వీడియోలు ఇప్పటివా? గతంలోనివా? అనే క్లారిటీ లేకుండాపోయింది. కానీ, ఈ గాలింపు చర్యల వెనుక ఉన్న ప్రధాన లక్ష్యం మాత్రం భారత గూఢచారి హమ్జా అలీ మజారి అనే కామెంట్స్ సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. ధురంధర్‌లో ఇండియన్ స్పైగా నటించిన రణ్‌వీర్ సింగ్ పాత్ర పేరు 'హమ్జా అలీ మజారి'. ఇప్పుడు పాకిస్తానీలు చేస్తున్న స్టంట్ చూస్తుంటే.. హమ్జా అలీ మజారినే పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టుగా ఉంది వ్యవహారం అంటూ.. నెట్టింట సెటైర్స్ పేలుతున్నాయి. అయినా, ధురంధర్ చిత్రంలో చూపించిన సన్నివేశాలు నిజజీవితంలోనూ జరుగుతున్నాయన్న భయం అక్కడి భద్రతా సంస్థలకు ఇప్పుడు రావడం విశేషం. లియారి ప్రాంతంలోని సామాన్య పౌరులు తమ ఇరుగుపొరుగు వారిని కూడా అనుమానపు చూపులతో చూసే పరిస్థితి నెలకొంది. అయినా సినిమాలో చూసిన కల్పిత పాత్రలతో పాటు మన ఒరిజినల్ స్పై ఏజెంట్‌లను ఇప్పుడు పట్టుకుంటామంటే.. పాకిస్తానీ జనాలు సైతం ఆశ్చర్యపోయే పరిస్థితి కనిపిస్తోంది. ఏదేమైనా.. పాకీలంటే ఆ మాత్రం ఉంటది మరి!




# అమ్మ మాటలతో కొత్త ఊపిరి

టాలీవుడ్లోకి మెరుపుతీగలా దూసుకొచ్చి అతి తక్కువ సమయంలోనే అగ్ర హీరోలసరసన నటించే అవకాశం దక్కించుకుని మోస్ట్ వాంటెడ్ హీరోయిన్గా పేరు తెచ్చుకుంది శ్రీలీల. పెళ్లి సందడి చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ఈ భామ.. తన డ్యాన్సింగ్ స్కిల్స్, ఎనర్జీతో కుర్రకారును ఆకట్టుకుంది. ఆ తర్వాత రవితేజతో చేసిన ధమాకా బ్లాక్బస్టర్ కావడంతో ఆమె దశ తిరిగింది. మహేశ్ బాబు, బాలకృష్ణ, పవన్ వంటి స్టార్ హీరోల సినిమాల్లో వరుస అవకాశాలు అందుకుంది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆమె తన కెరీర్ ప్రా రంభంలో ఎదుర్కొన్న చేదు అనుభవాల ను పంచుకుంది. సోషల్ మీడియాలో తనపై వచ్చిన విపరీతమైన ట్రోలింగ్ చూసి ఒక దశలో కుంగిపోయిం దట. గదిలో ఒంటరిగా కూర్చుని ఏడ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నా యట. ఆ బాధ భరించలేక సినిమాలు తన ఒంటికి పడవని నిర్ణయించుకుందట. ఇక తాను సినిమాలు చేయనని, మళ్లీ కాలేజీకి వెళ్లి చదువుకుంటానని చెప్పిందట. తీవ్ర నిరాశలో ఉన్న తనకు అమ్మచెప్పిన మాటలు కొత్త ఊపిరిని పోశాయని చెప్పింది. తన గురించి ప్రజలు అంత టైమ్ వేస్ట్ చేసు కుంటున్నారంటే తాను ఎదిగినట్లు అర్థమని చెప్పిందట.

# హరీష్ శంకర్.. నెక్స్ట్ ఏంటి?



పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాకు మొదటి రోజు నుంచే మిక్స్డ్ టాక్ వచ్చింది. అయినా కూడా ఫస్ట్ డే భారీ వసూళ్లు వచ్చాయి. కానీ, సెకండ్ డే నుంచి కలెక్షన్స్ భారీగా డ్రాప్ అయ్యాయి. మొదటి రోజు ఇండియాలో 35 కోట్ల వరకు రాబట్టిన ఉస్తాద్.. రెండు, మూడో రోజున 9 కోట్లకు పైగా కలెక్ట్ చేసింది. కానీ, నాలుగో రోజు మాత్రం 8 కోట్లు మాత్రమే వసూలు చేసింది. ఇక ఐదో రోజు మండే నాడు ఉస్తాద్ లెక్క మరింత తగ్గింది. రెండు కోట్ల లోపే నెట్ వసూలు చేసింది. దాంతో 'ఉస్తాద్ భగత్ సింగ్' ఐదు రోజుల టోటల్ ఇండియా నెట్ కలెక్షన్ రూ. 62 కోట్లకు చేరుకోగా గ్రాస్ రూ. 73 కోట్లకు పైగా ఉంది. ఓవర్సీస్‌లో రూ. 10 కోట్లకు పైగా వసూలు చేయగా.. మొత్తంగా వరల్డ్ వైడ్‌గా ఐదు రోజులకు గాను రూ. 83 కోట్లకు పైగా గ్రాస్ వసూలైనట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.మరి కలెక్షన్స్ ఇలా ఉంటే, ఉస్తాద్ బ్రేక్ ఈవెన్ టార్గెట్ రీచ్ అవుతుందా? లేదా? అనే చర్చ జరుగుతోంది ట్రేడ్ వర్గాల్లో. అలాగే.. డైరెక్టర్ హరీష్ శంకర్ నెక్స్ట్ ప్రాజెక్ట్ ఏంటనే టాక్ కూడా మొదలైంది ఇండస్ట్రీలో. నిజానికి, రవితేజ 'మిస్టర్ బచ్చన్' సినిమాతో డిజాస్టర్ చూశాడు హరీష్. దీంతో.. ఎలాగైనా సరే పవర్ స్టార్ సినిమాతో హిట్ కొట్టాలని అనుకున్నాడు. కానీ, ఉస్తాద్ అనుకున్నంత స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో హరీష్ తర్వాతి సినిమాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే నందమూరి బాలకృష్ణతో ఓ సినిమా ఉంటుందనే టాక్ ఉంది. కానీ, బాలయ్య మాత్రం నెక్స్ట్ వివేక్ ఆత్రేయతో ఓ సినిమా కమిట్ అయ్యారు. అలాగే.. మెగాస్టార్‌తో కూడా ఓ సినిమా ఉంటుందని ఉస్తాద్ ప్రమోషన్స్‌లలో భాగంగా హరీష్ చెప్పుకొచ్చాడు. అయితే, ప్రస్తుతం చిరంజీవి లైనప్ కూడా భారీగా ఉంది. బాబీ, శ్రీకాంత్ ఓదెల లాంటి దర్శకులతో సినిమాలు చేస్తున్నారు. కాబట్టి, ఈ కాంబినేషన్స్ ఇప్పట్లో సెట్ అయ్యేలా కనిపించడం లేదు. మరి హరీష్ నెక్స్ట్ ప్రాజెక్ట్ ఎవరితో చేస్తాడు? స్టార్ హీరోతో సెట్ అయితే మాత్రం.. ఖచ్చితంగా హిట్ కొట్టాల్సిందేనని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. మరి హరీష్ ఎలా ప్లాన్ చేస్తున్నాడో చూడాలి.

# యంగ్ హీరోలు కూడా సాటిరారు!



లాస్ట్ ఇయర్ మోహన్ లాల్ చూపించిన హవా అంతా ఇంతా కాదు. 'ఎల్2 ఎంపురన్', 'తుడరుమ్', 'హృదయ పూర్వం'తో హ్యాట్రిక్ హండ్రెడ్ క్రోర్ చిత్రాలను టేస్ట్ చేశారు. కానీ 'వృషభ' టోటల్ హ్యాపీనెస్ ను స్మాష్ చేసేసింది. వృషభ ఆల్ట్రా డిజాస్టరైనా.. లాలట్టన్ లైనప్ కు వచ్చిన ఢోకా లేదు. ఇంకా చెప్పాలంటే.. మరింత బిజీగా మారుతున్నారు.2025 మోహన్ లాల్ నామ సంవత్సరం అనొచ్చు. ఒకటి కాదు రెండు కాదు బ్యాక్ టు బ్యాక్ చిత్రాలతో హిట్స్ అందుకున్నారు. ఎల్2 ఎంపురన్, తుడరుమ్ ఆయన కెరీర్ లోనే కాదు.. మాలీవుడ్ హయ్యెస్ట్ గ్రాసర్ చిత్రాలుగా నిలిచాయి. లోక రానంత వరకు ఎంపురన్ హయ్యెస్ట్ గ్రాసర్ ఫిల్మ్. హృదయ పూర్వం కూడా వంద కోట్ల క్లబ్ లోకి చేరడంతో లాలట్టన్ ఆనందానికి అవధుల్లేవ్. మాలీవుడ్ చిత్రాలు కంప్లీట్ స్టార్ గ్రాఫ్ అమాంతం పెరిగితే.. భారీ బడ్జెట్ చిత్రాలు కన్నప్ప, వృషభ హ్యాట్రిక్ హిట్ కొట్టానన్న హ్యాపీనెస్ కూల్చేశాయి. కన్నప్పలో క్యామియో కాబట్టి లైట్ తీసుకున్నా.. వృషభ మాత్రం గట్టి దెబ్బే వేసింది. మరోసారి లాలట్టన్ కు భారీ చిత్రాలు కలిసి రావన్న ముద్ర పడింది.బొమ్మ డిజాస్టరైనా మోహన్ లాల్ ఆఫర్స్ కు వచ్చిన ఢోకాలేదు. జీతూ జోసేఫ్ తో దృశ్యం-3 తో పాటు తన దోస్త్ మమ్ముట్టితో కలిసి పేట్రియాట్ మల్టీస్టారర్ ఫిల్మ్ చేస్తున్నారు. ఇవే కాదు ఆయన లైనప్ చూస్తే మాలీవుడ్ యంగ్ హీరోలు కూడా సాటిరారు. సీనియర్ అండ్ యంగ్ డైనమిక్ దర్శకులతో కొలబరేట్ అవుతూ.. టూ జనరేషన్స్ ఆడియన్స్ ను టార్గెట్ చేస్తున్నారు మోహన్ లాల్. తుడరుమ్ తో తనకు మాసివ్ హిట్టిచ్చిన తరుణ్ మూర్తితో ఎల్366 చేస్తున్న లాలట్టన్.. సీనియర్ దర్శకుడు ప్రియదర్శన్ 100వ సినిమాకు ఓకే చెప్పారు.మోహన్ లాల్ మూవీతో దర్శకుడిగా ఇంట్రడ్యూసైన ప్రియదర్శన్.. మళ్లీ ఆయనతోనే వందో సినిమా చేయనున్నాడు. మరక్కార్ తో భారీ డిజాస్టర్ ఇచ్చిన ప్రియదర్శన్ ను నమ్మి మరో ఛాన్స్ ఇచ్చారు లాలట్టన్. తన కూతురు విస్మయను హీరోయిన్ గా ఇంట్రడ్యూస్ చేస్తోన్న తుడక్కుమ్ లోనూ కీ రోల్ చేస్తున్నారు కంప్లీట్ స్టార్. హృదయ పూర్వం దర్శకుడు సత్యన్ అంతికాడుకు తనను డీల్ చేసే గోల్డెన్ ఆపర్చునిటీ అందించారు మోహన్ లాల్. మహేషంటే ప్రతీకారమ్, జోజు చిత్రాలతో పాపులరైన దిలీష్ పోతన్, విష్ణు మోహన్ అనే యంగ్ దర్శకులకు తన లైనప్ లో ప్లేస్ ఇచ్చారు. అలాగే లాలట్టన్ తో సినిమాలు చేయకపోతే నిద్ర పట్టని జీతూ జోసేఫ్ మరోసారి టయ్యప్ అయ్యే ఛాన్స్ లు కనిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్స్ అన్నీ ఆశీర్వాద్ సినిమాస్, శ్రీ గోకులం మూవీస్ నిర్మిస్తున్నట్లు సమాచారం.

# సారీలో గ్లామర్ మెరుపులు

సోనాల్ చౌహన్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈ బ్యూటీ బాలీవుడ్ చిత్రం 'జన్నత్' ద్వారా వెండితెరకు పరిచయం అయింది. అనంతరం 'రెయిన్‌బో' చిత్రంతో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. అయితే ఆ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఈమెకు పెద్దగా గుర్తింపు దక్కలేదు.దీంతో కొన్ని సంవత్సరాల పాటు సోనాల్ చౌహన్ తెలుగు సినీ పరిశ్రమ వైపు చూడలేదు. తరువాత 2014లో నటసింహం నందమూరి బాలకృష్ణ హీరోగా తెరకెక్కిన 'లెజెండ్' చిత్రంతో మళ్లీ టాలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇచ్చింది. ఈ చిత్రం ఘన విజయం సాధించడంతో ఈ బ్యూటీకి మంచి గుర్తింపు వచ్చింది. ఆ తరువాత సోనాల్ చౌహన్ తెలుగులో పలు చిత్రాల్లో నటించింది.ముఖ్యంగా బాలయ్య సినిమాలతో ఈమెకు మంచి విజయాలు దక్కాయి. చివరిగా ఈమె తెలుగులో 'ఎఫ్ 3' చిత్రంలో కనిపించింది. ఆ సినిమా తర్వాత ఇప్పటివరకు ఏ భాషలోనూ కొత్త సినిమాలు చేయలేదు. ఇప్పటివరకు సోనాల్ తన నటనతో పాటు అందాలతో కూడా ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది.సినిమాల్లోనే కాకుండా సోషల్ మీడియాలో కూడా అదే స్థాయిలో అభిమానులను అలరిస్తోంది. దీంతో ఈమెకు సోషల్ మీడియాలో భారీ స్థాయిలో ఫాలోవర్లు ఉన్నారు. తాజాగా ఈ బ్యూటీ తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలను పోస్ట్ చేసింది.అందులో సోనాల్ గోల్డ్ కలర్‌లో హెవీ వర్క్ ఉన్న చీరను ధరించి, పింక్ స్టోన్ వర్క్ ఉన్న స్ట్రాప్‌లెస్ బ్లౌజ్‌లో మెరిసింది. మెడను హత్తుకునే భారీ నెక్లెస్‌తో పాటు మ్యాచింగ్ ఇయర్ రింగ్స్ ధరించి స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకుంది. అలాగే స్టైలిష్ హెయిర్ స్టైల్‌తో తన నడుము, ఎద అందాలను హైలైట్ చేస్తూ ఇచ్చిన స్టిల్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



# శ్రీ విష్ణు మరో సినిమా..



కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు గతేడాది 'సింగిల్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చి పెద్దగా మెప్పించలేక పోయాడు. తర్వాత హిలేరియస్ జాయ్‌రైడ్ 'విష్ణు విన్యాసం'తో అలరించాడు. యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మించిన ఈ చిత్రంలో నయన సారిక హీరోయిన్‌గా నటించింది. రిలీజ్‌కు ఈ మూవీపై మంచి బజ్ క్రియేట్ కాగా.. కచ్చితంగా హిట్ సొంతం చేసుకుంటుంది అని భావించారు అంతా. ఇక పాజిటివ్ ఎక్స్‌పెక్టేషన్స్ మధ్య ఫిబ్రవరి 27న రిలీజైన ఈ సినిమా కూడా శ్రీ విష్ణుకి అంతగా కలిసి రాలేదు.ఇలా వరుస పరాజయాలు చవిచూస్తున్న విష్ణు ఇప్పుడు తన నెక్స్ట్ ప్రాజెక్టుపై ఆశలు పెట్టుకున్నాడు. ఈ క్రమంలోనే రామ్ అబ్బరాజుతో ఓ సినిమా చేస్తున్నాడు. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'సామజవరగమన' కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చి బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించింది. ఇప్పుడు మరోసారి వీరి కాంబినేషన్‌లోనే సినిమా రాబోతుందంటే హై ఎక్స్‌పెక్టేషన్స్ నెలకొన్నాయి. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ వచ్చింది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై రాబోతున్న ఈ చిత్రం షూటింగ్ తాజాగా స్టార్ట్ అయింది. ఇది ఫుల్ ఫన్ ఎంటర్‌టైన్మెంట్‌గా తెరకెక్కబోతున్నట్లు తెలుస్తుండగా.. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన పోస్టులు వైరల్ అవుతున్నాయి.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**